Follow: @ANNTELUGU
15-08-2026
ANN తెలుగు
మహా పత్రిక
15TH AUGUST INDIA INDEPENDENCE DAY
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 221 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# జనగణన-2027పై కేంద్రం కీలక నోటిఫికేషన్

- తొలిసారిగా సమగ్ర కుల గణన
- జనగణనలో పౌరులకు అడిగే 40 ప్రశ్నలు

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

**టాప్ న్యూస్**

## నేను కూడా సైబర్ నేరాల బాధితుడినే



- హీరో అక్కినేని నాగార్జున
- 15 రోజులకు ఓసారి పాస్‌వర్డ్ మారుస్తా

02

## అనసూయ మరో రచ్చ



- జై శ్రీరామ్ అనేవాళ్ళలో దొంగలున్నారంటూ గతంలో కామెంట్స్
- ఇపుడు వైరల్ కావడంతో సుదీర్ఘ వివరణ

02

## ఒకరినొకరు అతిపెద్ద ముప్పుగా భావిస్తున్న భారత్, పాకిస్తాన్



- అమెరికా సర్వేలో ఆసక్తికర విషయాలు
- అమెరికాలో 45 శాతం మంది భారత్ పట్ల సానుకూల దృక్పథం

02

## బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా?

- గత ప్రభుత్వం గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెప్పింది
- పూలే దంపతుల విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని మిగతా 2వ పేజీలో



ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

- డిసెంబర్ 7 నుండి మూడు రోజుల సదస్సు
- ఫ్యూచర్ సిటీతో పాటు పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటేలా నిర్వహణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం

02

## వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు సందేశం



**ఢిల్లీ, మహా :** దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు. యువత తమ ప్రతిభను ఉపయోగించుకుని తమ స్వప్నాలను సాకారం చేసుకోవడంతో పాటు దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన 'వందేమాతరం' గేయాన్ని గౌరవించాలని రాష్ట్రపతి ప్రజలను కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన న్యాయవ్యవస్థ, చట్టసభలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

## అగ్నిమాపక దళానికి అధునాతన వాహనాలు

- రూ.40 కోట్లతో 58 ఫైర్‌ఫైటింగ్ వాహనాలు
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం చంద్రబాబు.

02




# ఒకరినొకరు

## అతిపెద్ద ముప్పుగా భావిస్తున్న భారత్, పాకిస్థాన్

**మహా :** భారత్, పాకిస్థాన్ ప్రజల మధ్య ఉన్న తీవ్రమైన అవిశ్వాసం మరోసారి అంతర్జాతీయ సర్వేలో స్పష్టమైంది. ఈ రెండు పొరుగు దేశాల ప్రజలు ఒకరినొకరు తమ దేశానికి ఉన్న అత్యంత పెద్ద భౌగోళిక, రాజకీయ ముప్పుగా భావిస్తున్నారని అమెరికాకు చెందిన ప్రముఖ థింక్ ట్యాంక్ 'ప్యూ రీసెర్చ్' తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడించింది. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దక్షిణాసియా దేశాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను రూపొందించారు. ఈ అధ్యయనం ప్రకారం సర్వేలో పాల్గొన్న భారతదేశంలోని వయోజనుల్లో 54 శాతం మంది పాకిస్థాన్‌ను తమ అతిపెద్ద భౌగోళిక, రాజకీయ ముప్పుగా అభివర్ణించారు. ఆ తర్వాత 21 శాతం మంది చైనా పేరు చెప్పారని అధ్యయనం పేర్కొంది. దాదాపు మూడింట ఒక వంతు మంది భారతీయులు రష్యాను తమ ప్రధాన మిత్రదేశమనగా, 16 శాతం మంది అమెరికా పేరు చెప్పారు. సుమారు మూడింట ఒక వంతు మంది భారతీయులు ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని అధ్యయనం తెలిపింది. అటు సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 45 శాతం మంది అమెరికా, 58 శాతం రష్యాపై, కేవలం 23 శాతం మంది చైనాను విశ్వసిస్తున్నారని తెలిపింది. మరోవైపు భారతీయుల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై 51 శాతం మంది, డొనాల్డ్ ట్రంప్‌పై 39 శాతం మంది నమ్మకం వ్యక్తం చేశారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కేవలం 25 శాతం మంది భారతీయులు మాత్రమే విశ్వసించారు. 43 శాతం మంది పాకిస్థానీయులు భారతదేశం తమకు అతిపెద్ద ముప్పుగా భావించారని అధ్యయనం చెప్పింది. ఆ తర్వాత ఇజ్రాయెల్, చైనాల గురించి చెరో 24 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపింది. పాకిస్థానీయుల్లో స్పష్టంగా 75 శాతం మంది చైనా తమ అత్యంత ముఖ్యమైన మిత్రదేశంగా అభిప్రాయపడ్డారు. కొంత తక్కువ స్థాయిలో 12 శాతం మంది సౌదీ అరేబియాను పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌ల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నప్పటికీ, కేవలం 15 శాతం మంది పాకిస్థానీలు మాత్రమే అగ్రరాజ్యం పట్ల సానుకూల అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. అత్యధికంగా 90శాతం మంది చైనా పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉన్నారని పేర్కొంది. ఇక ప్రపంచ వ్యవహారాల్లో ట్రంప్ సరైన పని చేస్తారని కేవలం 12 శాతం మంది పాకిస్థానీయులకు మాత్రమే నమ్మకం ఉందని ప్యూ రీసెర్చ్ వెల్లడించింది. అయితే 83 శాతం మంది మాత్రం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గురించి ఇలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపింది.

## వాతావరణ ప్రతికూలత ఉన్నా రికార్డు స్థాయికి చేరువలో చార్ ధామ్ యాత్ర

- 47 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య
- భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్న సీఎం పుష్కర్ సింగ్ దామి

**హైదరాబాద్, మహా :** ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. రుతుపవనాల ప్రభావంతో వాతావరణ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయికి చేరుకుంటోంది. యాత్రా సీజన్ ప్రారంభమైన కేవలం 114 రోజుల్లోనే, మొత్తం 4,702,703 మంది భక్తులు ఈ పవిత్ర క్షేత్రాలను సందర్శించారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ సంఖ్య 468,556 అధికం. ఈ ఏడాది ఈ యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది. భక్తుల భద్రతే తమ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నొక్కి చెప్పారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ యాత్ర సజావుగా సాగేలా చూడటానికి అప్రమత్తంగా ఉండాలని ఆయన సంబంధిత శాఖలను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు విపత్తు నిర్వహణ బృందాలు నిరంతరం సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయన స్వయంగా రాష్ట్ర విపత్తు నియంత్రణ గది నుండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు ప్రభుత్వం తాత్కాలికంగా యాత్రను నిలిపివేస్తూ, యాత్రికుల రాకపోకలను నియంత్రిస్తోంది. సోమవారం వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ, 15,376 మంది భక్తులు చార్ ధామ్ క్షేత్రాలను సందర్శించారు. ఈ క్షేత్రాలలో బద్రీనాథ్ అత్యధిక సంఖ్యలో భక్తులను ఆకర్షించింది; ఇక్కడ 1,612,112 మంది సందర్శించారు. ఆ తర్వాతి స్థానాల్లో కేదార్‌నాథ్‌ను 1,450,116 మంది, గంగోత్రిని 737,629 మంది, యమునోత్రిని 662,347 మంది సందర్శించారు. వీటితో పాటు, 240,499 మంది భక్తులు హేమ్‌కుండ్ సాహిబ్‌ను సందర్శించారు. గత ఏడాదితో పోలిస్తే కేవలం బద్రీనాథ్ క్షేత్రానికే అదనంగా 3.5 లక్షల మందికి పైగా యాత్రికులు వచ్చారని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 19న గంగోత్రి, యమునోత్రి ఆలయాల ద్వారాలు తెరవడంతో ఈ ఏడాది చార్ ధామ్ యాత్ర ప్రారంభమైంది, అలాగే ఏప్రిల్ 23న బద్రీనాథ్ ఆలయం తెరుచుకుంది. హిందూమతంలో అత్యంత పవిత్రమైన యాత్రా స్థలాలుగా పరిగణించబడే యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్ మరియు బద్రీనాథ్‌లను కలిపి 'ఛోటా చార్ ధామ్' అని పిలుస్తారు. దేశ ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ఐక్యతను బలోపేతం చేయడానికి ఆది శంకరాచార్యులు 8వ శతాబ్దంలో ఈ తీర్థయాత్రా సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

# అనసూయ మరో రచ్చ

- జై శ్రీరామ్ అనేవాళ్ళలో దొంగలున్నారంటూ గతంలో కామెంట్స్
- ఇపుడు వైరల్ కావడంతో సుదీర్ఘ వివరణ



**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ నటి, వ్యాఖ్యాత అనసూయ భరద్వాజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. హిందూ ధర్మంపై తాను గతంలో చేసిన కొన్ని వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగడంతో, ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా స్పష్టత ఇచ్చారు. తన వ్యాఖ్యలను కొందరు కావాలనే వక్రీకరించి, ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని అనసూయ ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏ మతాన్ని కించపరచను, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాను. నేను సనాతన ధర్మాన్ని పాటించే పక్కా హిందువుని. నా ధర్మం, నా విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి అనుమానం లేదు. నేను చెప్పిన మాటల నుంచి అసలు విషయాన్ని తొలగించి, సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా ప్రచారం చేయడం ఎంతమాత్రం సరికాదు" అని ఆమె పేర్కొన్నారు. గతంలో ఒక సందర్భంలో మాట్లాడుతూ.. "జై శ్రీరామ్' అనేవాళ్లలో కొందరు పెద్ద దొంగలు ఉన్నారని, జై శ్రీరామ్ ముసుగులో దాడులకు తెగబడుతున్నారని" అనసూయ వ్యాఖ్యానించారు. కేవలం నినాదాలు చేయడం కాదని, వ్యక్తుల ప్రవర్తనే అత్యంత ముఖ్యమని అన్నారు. సనాతన ధర్మం పేరుతో దాడులు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ఆమె ప్రశ్నించారు. అంతేకాకుండా, తాను కొలిచేది శ్రీరాముడినేనని, ఆయనపై ఉన్న భక్తితోనే తన పెద్ద కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని స్పష్టం చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలపై పలు హిందూ సంఘాలు, నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హిందువులను, వారి నమ్మకాలను కించపరచడం కొందరికి ఫ్యాషన్‌గా మారిపోయిందంటూ ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం కాస్త పెద్దదిగా మారడంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు అనసూయ తాజాగా క్లారిటీ ఇస్తూ వివరణ ఇచ్చుకున్నారు.

# బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా?

( మొదటి పేజ తరువాయి )

చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు.



**సామాజిక చైతన్యంతో నిర్ణయాలు**

సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలి' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్ లు పాల్గొన్నారు.

# ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

**హైదరాబాద్,మహా :** తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహించాలని నిర్ణయించారు. గతేడాది నిర్వహించిన సదస్సు కంటే మరింత ఘనంగా, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ'ను ప్రధాన థీమ్‌గా తీసుకుని రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు వివరించనున్నారు. సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాట్లను ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో భవిష్యత్ అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రణాళికను సదస్సులో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఫ్యూచర్ సిటీ ద్వారా రాష్ట్రంలో రానున్న ఆధునిక మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు. హైదరాబాద్‌ను భవిష్యత్ నగరంగా మరింత అభివృద్ధి చేసే ప్రణాళికలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందుంచనున్నారు. రక్షణ రంగం, ఏరోస్పేస్, ఫార్మాస్యూటికల్స్‌తోపాటు వివిధ పారిశ్రామిక రంగాల్లో తెలంగాణకు ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఇప్పటికే ఏర్పడిన పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా వచ్చిన ఉపాధి అవకాశాలు, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సదస్సులో వివరించనున్నారు.

**స్టార్టప్ విజయాలు కూడా..**

తెలంగాణ స్టార్టప్ రంగం సాధించిన విజయాలకు కూడా సదస్సులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రాష్ట్రానికి చెందిన స్టార్టప్‌లు, పరిశ్రమలు వివిధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రదర్శించడంతోపాటు, కొత్త ఆవిష్కరణలకు వేదిక కల్పించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు, సాంకేతిక సంస్థలు తమ ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రపంచ పెట్టుబడిదారులకు పరిచయం చేసుకునే అవకాశం కల్పించనున్నారు. సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, వివిధ రంగాల ప్రతినిధులను ఆహ్వానించేలా ఏర్పాట్లు చేయనున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, మౌలిక వసతులు, నైపుణ్యమున్న మానవ వనరులు, వివిధ రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే సదస్సు ద్వారా తెలంగాణను పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. గతేడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల పురోగతిని కూడా ఈ సందర్భంగా ప్రదర్శించే అవకాశం ఉంది. డిసెంబరు సదస్సు కోసం ప్రత్యేక కమిటీల ఏర్పాటుతో పాటు శాఖల వారీగా బాధ్యతలు అప్పగించి విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది.

# పంద్రాగస్టు వేళ...రాష్ట్ర పోలీసులకు కేంద్ర పతకాల పంట

- ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు
- గ్రేహౌండ్స్ సిబ్బందికి శౌర్య పతకాలు
- వివిధ విభాగాల అధికారులకు ప్రశంసనీయ సేవా పతకాలు



**హైదరాబాద్, మహా :** స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు పోలీసు అధికారులు , సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పతకాలతో గౌరవించింది. విధుల్లో చూపిన అసమాన ధైర్యసాహసాలు, విశిష్ట సేవలు , నిబద్ధతకు గుర్తింపుగా 'రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం' (పీపీడీఎంఎస్), 'శౌర్య పతకం' (పీఎంజీ) , 'ప్రశంసనీయ సేవా పతకాలను' (పీఎంఎంఎస్) ప్రకటించింది. ప్రజాసేవలోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు ఈ పురస్కారాలు లభించాయి.

**విశిష్ట సేవా పతకాలు , శౌర్య పురస్కారాల గ్రహీతలు**

అత్యున్నతమైన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆర్. జగదీశ్వర్ రెడ్డి, సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య జోగుల ఎంపికయ్యారు. అలాగే ప్రాణాలకు తెగించి పోరాడే వీరోచిత ప్రతిభ కనబరిచినందుకు గాను గ్రేహౌండ్స్ రంగానికి చెందిన బి. సత్యరావు (పిసి), కె. సందీప్ కుమార్ (పిసి), జె. వంశీకృష్ణ (పిసి)లు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శౌర్య పతకాలను దక్కించుకున్నారు.

**ప్రశంసనీయ సేవా పతకాల (మెరిటోరియస్ సర్వీస్) విజేతలు**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంసనీయ సేవా పతకాలు లభించాయి. వీరిలో కరీంనగర్ అదనపు డీసీపీ పి. వెంకటరమణ, హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ ఏసీపీ ఆర్.జి. శివ మారుతి, సైబరాబాద్ సీటీసీ ఏసీపీ ఆశాల గంగారామ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ బి. రవికుమార్ రెడ్డి, టీజీ ఈగిల్ ఫోర్స్ డీఎస్పీ బచలకుర రమేష్, సీఐడీ డీఎస్పీ బి. శ్రీనివాసరావు, టీజీఎస్పీ 8వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి. సత్యనారాయణ, సైబరాబాద్ ఇన్‌స్పెక్టర్ పి. జగదీశ్వర్, ఆక్టోపస్ హెడ్ కానిస్టేబుల్ సి. రాములు, పిటిఓ హెడ్ కానిస్టేబుల్ కురపాటి తిరుపతి రాజు ఉన్నారు. వీరితో పాటు గ్రేహౌండ్స్‌కు చెందిన హోంగార్డు మేడిపల్లి యాదయ్య కూడా ప్రశంసనీయ సేవా పతకాన్ని సాధించారు.

## నేను కూడా సైబర్ నేరాల బాధితుడినే

- హీరో అక్కినేని నాగార్జున
- 15 రోజులకు ఓసారి పాస్‌వర్డ్ మారుస్తా

**హైదరాబాద్, మహా:** తాను కూడా సైబర్ నేరాల బాధితుడినేనని హీరో అక్కినేని నాగార్జున అన్నారు. ఈ సందర్భంగా తన లైఫ్‌లో జరిగిన సంఘటన గురించి వివరించారు. ఐదేళ్ల క్రితం బ్యాంక్ అధికారిని అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో తనను మోసం చేసేందుకు ప్రయత్నించాడని నాగార్జున వివరించారు. తన కుటుంబంలో కొందరిని మాయమాటలతో 67 గంటల పాటు డిజిటల్ అరెస్టు చేశాడని వివరించారు. విదేశాలకు నార్కోటిక్ సబ్‌స్టాన్స్ పార్సిల్ పంపారంటూ సైబర్ నేరగాళ్లు కాల్స్ చేశారంటూ ఆయన గుర్తుచేశారు. సైబర్ క్రైమ్ అరికట్టడంలో తెలంగాణ సైబర్ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారని నాగార్జున కొనియాడారు. వారానికి ఒకసారి మొబైల్ పాస్‌వర్డ్, నెలకు ఒకసారి వైఫై పాస్‌వర్డ్ మారుస్తామని వివరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ లో సురక్ష కా తిరంగా సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ మోసాల పట్ల తాను ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటానన్నారు. పాస్‌వర్డ్‌ను తరచూ మారుస్తుంటానని, ఫోన్‌లో ఫొటోలు తీసుకోనని తెలిపారు. ప్రజల్లో సైబర్ నేరాల అవగాహన కల్పించడం, నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసుల విశేష కృషి చేస్తున్నారని నాగ్ అభినందనలు తెలిపారు.

## జనగణన2027పై కేంద్రం కీలక నోటిఫికేషన్

- తొలిసారిగా సమగ్ర కుల గణన
- జనగణనలో పౌరులకు అడిగే 40 ప్రశ్నలు

ఢిల్లీ, మహా : దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.



## గంజాయి సేవించిన వ్యక్తిని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**జూలూరుపాడు, మహా:** గంజాయి సేవించిన వ్యక్తిని డిఅడిక్షన్ సెంటర్ కు తరలించిన సంఘటన జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జూలూరుపాడు కు చెందిన వ్యక్తిని గంజాయి సేవిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని మూత్ర నమూనాను డ్రగ్ టెస్టింగ్ కిట్ ద్వారా పరీక్షించగా టిహెచ్సి పాజిటివ్ గా తేలింది. ఈ ఘటనపై ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. నిందితుడు గంజాయి సేవించే అలవాటును మానుకుని చికిత్స పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపిన నేపథ్యంలో, న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం అతనిని డీఅడిక్షన్ సెంటర్‌కు చికిత్స, పునరావాసం నిమిత్తం పంపించినట్లు ఎస్ హెచ్ ఓ జీనత్ కుమార్ తెలిపారు.

# అగ్నిమాపక దళానికి అధునాతన వాహనాలు

- రూ.40 కోట్లతో 58 ఫైర్‌ఫైటింగ్ వాహనాలు.
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో మరింత వేగంగా స్పందించేందుకు అగ్నిమాపక శాఖను ఆధునికీకరిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా రూ.40 కోట్ల వ్యయంతో సమకూర్చిన 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో నిర్వహించిన ఫైర్ వెహికల్స్ ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో సీఎం జెండా ఊపి వాహనాలను సేవల్లోకి ప్రవేశపెట్టారు.

గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సంభవించే అగ్నిప్రమాదాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసేందుకు నిరంతరాయంగా నీటిని అందించాల్సి ఉండటంతో 20 వాటర్ బౌజర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటితోపాటు ఇరుకైన వీధులు, రద్దీ ప్రాంతాల్లోకి సైతం వేగంగా చేరుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను సిద్ధం చేసింది.

కొత్త వాహనాలతో అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవడంతోపాటు మంటలను వేగంగా అదుపులోకి తీసుకురావడానికి వీలవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సాధారణ ఫైర్ ఇంజిన్లు చేరుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడనున్నాయి. భారీ ప్రమాదాల సమయంలో ఎక్కువ మొత్తంలో నీటిని నిరంతరంగా సరఫరా చేయడంలో వాటర్ బౌజర్లు కీలకంగా పని చేయనున్నాయి.

అగ్నిమాపక శాఖ ఆధునికీకరణలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే తొలి దశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజాగా మరో 58 అధునాతన వాహనాలు అందుబాటులోకి రావడంతో రాష్ట్రంలో అగ్నిమాపక సేవల సామర్థ్యం మరింత పెరగనుంది. కొత్త వాహనాల్లో ఉన్న సాంకేతిక సదుపాయాలు, వాటి పనితీరు, అత్యవసర సమయాల్లో వినియోగించే విధానాన్ని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు వేగవంతమైన స్పందన వ్యవస్థ అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖకు ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూర్చడంతోపాటు సేవలను మరింత సమర్థంగా అందించే దిశగా చర్యలు చేపడుతోంది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతన వాహనాల సేవలతో రాష్ట్రంలోని పట్టణాలతోపాటు గ్రామీణ, అటవీ ప్రాంతాల్లోనూ అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక శాఖ మరింత వేగంగా స్పందించే అవకాశం ఏర్పడింది.



## పిఠాపురం ఆలయాల్లో అన్నా లెజినోవా ప్రత్యేక పూజలు

**కుక్కుటేశ్వర స్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, ద్రాక్షారామం భీమేశ్వరుడి దర్శనం.**

**పిఠాపురం, మహా.** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించారు. పాదగయ క్షేత్రంలోని శ్రీ కుక్కుటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు అధికారులు, ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కుక్కుటేశ్వర స్వామి దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు అన్నా లెజినోవాకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం ఆమె శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం కావడంతో ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తుండగా, అన్నా లెజినోవా రాకతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత కోనసీమ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని అన్నా లెజినోవా సందర్శించారు. స్వామివారితోపాటు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు స్వాగతం పలికారు. అన్నా లెజినోవా ఆలయాల సందర్శనకు వ్యక్తిగత భక్తి, కుటుంబ శ్రేయస్సుతో పాటు ఇటీవల పవన్ కల్యాణ్‌కు జరిగిన శస్త్రచికిత్స నేపథ్యంలో మొక్కులు చెల్లించుకోవడం కూడా కారణమని తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌కు ముంబైలో భుజానికి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిన నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆమె పలు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. ఇటీవలే అన్నా లెజినోవా తిరుమల శ్రీవారిని కూడా దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలి నడకన తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తాజాగా పిఠాపురం, ద్రాక్షారామం ఆలయాలను సందర్శించడం ద్వారా ఆధ్యాత్మిక యాత్రను కొనసాగించారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవ, వైష్ణవ క్షేత్రాలకు భక్తుల రాక పెరిగింది. ఈ నేపథ్యంలో పిఠాపురంలోని పాదగయ క్షేత్రం, ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహిస్తున్నారు.

## సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!

**బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశం. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రాధాన్యం.**

**ఢిల్లీ, మహా :** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌లో పర్యటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో భారత్ ఆతిథ్యమివ్వనున్న బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు ఏఎన్ఐ వెల్లడించింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సదస్సుకు ఇరాన్ అధ్యక్షుడి రాకకు ప్రాధాన్యం ఏర్పడింది. 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' ప్రధాన అజెండాగా భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు జరగనుంది. 2026 ప్రారంభంలో బ్రెజిల్ నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, బహుళపక్ష సహకారం, అంతర్జాతీయ శాంతి, భద్రతకు సంబంధించిన అంశాలపై సభ్య దేశాల నేతలు చర్చించే అవకాశం ఉంది. ఇరాన్ 2024లో బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. అదే సమయంలో ఈజిప్ట్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా కూటమిలో సభ్యత్వం పొందాయి. అనంతరం 2025లో ఇండోనేషియా చేరడంతో బ్రిక్స్ పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. దీంతో విస్తరించిన బ్రిక్స్ వేదికపై భారత్, ఇరాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు కూడా మరింత ప్రాధాన్యం లభిస్తోంది. పెజెష్కియాన్ ప్రతిపాదిత పర్యటనకు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరో కీలక కారణంగా మారాయి. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ భారత్‌లో పర్యటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఆయన పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదని వ్యాఖ్యానించారు. అవసరమైతే భారత్ చేపట్టే నిర్మాణాత్మక ప్రయత్నాలను ఇరాన్ స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సైనిక పరిష్కారం కంటే చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాలే మార్గమని అరాఘ్చీ పేర్కొన్నారు. సంబంధిత దేశాల మధ్య సంభాషణకు భారత్ వంటి ప్రభావవంతమైన దేశాలు చేస్తున్న ప్రయత్నాలు పరిస్థితులను చక్కదిద్దడంలో ఉపయోగపడతాయని ఇరాన్ భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది. హర్మూజ్ జలసంధి విషయంలోనూ ఇరాన్ తన వైఖరిని స్పష్టం చేసింది. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన ఈ మార్గంలో వాణిజ్య, నౌకాయాన భద్రతకు ఇరాన్ కట్టుబడి ఉంటుందని అరాఘ్చీ తెలిపారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగిన సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పెజెష్కియాన్ 2024 అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరాన్‌భారత్ ద్వైపాక్షిక సంబంధాలతోపాటు పశ్చిమాసియా ప్రాంతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఇప్పుడు భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మరోసారి భేటీ అయ్యే అవకాశం ఉండటంతో ఇరుదేశాల సంబంధాలపై ఆసక్తి నెలకొంది. చాబహార్ పోర్టు, ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ అనుసంధానం వంటి అంశాలు భారత్‌ఇరాన్ సంబంధాల్లో కీలకంగా ఉన్నాయి. ముఖ్యంగా మధ్య ఆసియాతో భారత్‌కు అనుసంధానాన్ని పెంచే మార్గాల్లో ఇరాన్ కీలక భాగస్వామిగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల భద్రత, ఇంధన సరఫరాలు వంటి అంశాల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడి ప్రతిపాదిత భారత్ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ప్రాంతీయ దౌత్యానికి కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. అయితే పెజెష్కియాన్ పర్యటన తేదీలు, కార్యక్రమాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఆయన బ్రిక్స్ సదస్సుకు హాజరైతే ప్రధాని మోదీతో ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశముంది.

## ఢిల్లీ హైకోర్టు, విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

- ఈమెయిల్ ద్వారా హెచ్చరికలు.
- రంగంలోకి బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు.
- స్వాతంత్ర్య వేడుకల వేళ హైఅలర్ట్.




**ఢిల్లీ , మహా** : దేశ రాజధాని ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒక్క రోజు ముందు బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. ఢిల్లీ హైకోర్టుతోపాటు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశాలు రావడంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే ఆగస్టు 15 వేడుకల నేపథ్యంలో రాజధాని అంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు.. తాజా బెదిరింపులతో నిఘాను మరింత ముమ్మరం చేశారు.ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తోపాటు విమానాశ్రయ అధికారులకు బెదిరింపు ఈమెయిళ్లు అందినట్లు సమాచారం. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించి హైకోర్టు ప్రాంగణం, విమానాశ్రయ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలో ఇప్పటికే భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేశారు. ఎర్రకోటలో జరిగే ప్రధాన వేడుకలతోపాటు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సున్నితమైన ప్రాంతాలు, ముఖ్యమైన ప్రజా ప్రదేశాల వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. తాజా బెదిరింపుల నేపథ్యంలో ఈ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయంలో ప్రయాణికుల రాకపోకలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తనిఖీలను తీవ్రతరం చేశారు. అనుమానాస్పద బ్యాగులు, వస్తువులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బంది భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ హైకోర్టు పరిసరాల్లోనూ భద్రతను పెంచారు. కోర్టు ప్రాంగణంలోకి వచ్చే వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, శిక్షణ పొందిన శునకాలతో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. బెదిరింపు ఈమెయిళ్ల మూలం, వాటిని ఎవరు పంపించారు, వాటి వెనుక ఉద్దేశం ఏమిటన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు, ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లోనూ నిఘా పెంచారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అధికారులు సూచించారు. బెదిరింపు ఈమెయిళ్లలో పేర్కొన్న అంశాలపై భద్రతా సంస్థలు పూర్తి స్థాయిలో పరిశీలన కొనసాగిస్తున్నాయి. ప్రాథమిక తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువు గుర్తించబడిందా? లేదా బెదిరింపులు కేవలం భయాందోళనలు సృష్టించేందుకు పంపించారా? అనే విషయాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు వరుస బెదిరింపులు రావడంతో ఢిల్లీ భద్రతా వ్యవస్థ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

## దాడుల వ్యూహం మార్చిన ఐఎస్ఐ

- సైన్యం కన్నా రైల్వేలపైనే కన్ను
- భారత రైల్వే నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఐ భారీ కుట్ర
- దాడులే కాకుండా, తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే పన్నాగం
- ఆగస్టు 15 లక్ష్యంగా ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో దాడులకు ఆస్కారం
- సంచలన విషయాలు వెల్లడించిన నిఘావర్గాలు

**న్యూఢిల్లీ, మహా :** దేశానికి జీవనాడి అయిన భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) తన నివేదికలో హెచ్చరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐబీ అధికారుల ప్రకారం.. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. అయితే, ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. సైనిక స్థావరాలపై సమాచార సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది. ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు 'మైండ్ గేమ్స్' ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఇలాంటి పుకార్లతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి, ఎలాంటి దాడి లేకుండానే భారీ ప్రాణనష్టం కలిగించవచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు.ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పది రెట్లు పెంచింది. కేవలం రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువకులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫొటోలు తీయించడం, భద్రతా ఏర్పాట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది. మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు 'బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్' (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నించవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## ఛాతీలో అసౌకర్యంతో ఎయిమ్స్‌లో చేరిన జేపీ నడ్డా

- కరోనరీ యాంజియోగ్రఫీ చేసిన వైద్యులు.
- ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందన్న ఎయిమ్స్.

**ఢిల్లీ, మహా :** కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత జేపీ నడ్డా అస్వస్థతకు గురై ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. గురువారం సాయంత్రం ఛాతీలో అసౌకర్యంగా అనిపించడంతో ఆయనను ఆసుపత్రికి తరలించినట్లు ఎయిమ్స్ అధికారులు తెలిపారు. వైద్యులు నడ్డాకు కరోనరీ యాంజియోగ్రఫీ నిర్వహించి, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వెల్లడించారు.అస్వస్థతకు కారణాలను నిర్ధారించేందుకు వైద్యులు నడ్డాకు వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎయిమ్స్‌లోని కార్డియాలజీ విభాగంలో ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి అధికారిక ప్రకటనలో పేర్కొంది.ఆగస్టు 13 సాయంత్రం నడ్డాకు అసౌకర్యంగా అనిపించడంతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎయిమ్స్ తెలిపింది. అందులో భాగంగా కరోనరీ యాంజియోగ్రఫీ చేపట్టినట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఎలాంటి ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని, ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని స్పష్టం చేసింది. మరికొంత సమయం వైద్యుల పర్యవేక్షణలో ఉంచిన అనంతరం తదుపరి చికిత్స, డిశ్చార్జి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. నడ్డా ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోంది.

## కరూర్ బాధితులకు ఉద్యోగాలపై సుప్రీం ఊరట

కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. బాధిత కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తిని కోల్పోయినప్పుడు, పునరావాసంలో భాగంగా ఒకరికి ఉద్యోగం ఇవ్వడంలో తప్పేంటని ధర్మాసనం ప్రశ్నించింది. గతేడాది కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమంటూ రద్దు చేసింది. తాజాగా సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఉద్యోగ నియామకాలు ప్రస్తుతానికి కొనసాగనున్నాయి. అయితే ఈ కేసులో తుది తీర్పు వెలువడాల్సి ఉంది.

## అమరావతి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

**వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు.**

**గుంటూరు, మహా** : అమరావతి రాజధాని నిర్మాణం, మౌలిక వసతుల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అమరావతిని అద్భుత నగరంగా నిర్మిస్తున్నామంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, వాస్తవానికి అది అవినీతి, దోపిడీకి కేంద్రంగా మారుతోందని తీవ్ర విమర్శలు చేశారు. గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అమరావతి రాజధాని నిర్మాణాలు ఎప్పటికీ పూర్తయ్యేలా కనిపించడం లేదని అంబటి రాంబాబు అన్నారు. తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిలు, ఇతర మౌలిక వసతుల పేరుతో అప్పులు చేసి మరీ వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలపై ఆర్థిక భారం పెంచుతూ రాజధాని నిర్మాణం పేరుతో భారీగా నిధులను ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రహదారుల నిర్మాణ వ్యయంపై అంబటి రాంబాబు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం 22 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1,519 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. కిలోమీటరు రహదారికి సుమారు రూ.180 కోట్లు ఖర్చు చేయడం ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇంత భారీగా నిర్మాణ వ్యయాన్ని ఎందుకు చూపిస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు కూడా ప్రభుత్వం సరైన న్యాయం చేయడం లేదని అంబటి విమర్శించారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను త్యాగం చేశారని, వారి ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా రాజధాని నిర్మాణాల పేరుతో భారీ వ్యయాలు చేయడం సరికాదన్నారు. రాజధాని నిర్మాణాల అంచనా వ్యయాలను పదేపదే పెంచుతున్నారని అంబటి ఆరోపించారు. పనుల అంచనాలు పెంచడం వెనుక కమీషన్ల ప్రయోజనాలే ఉన్నాయని విమర్శించారు. మొదట తక్కువ అంచనాలు చూపించి పనులు ప్రారంభించిన తర్వాత వ్యయాన్ని పెంచుతూ పోవడం ద్వారా ప్రజాధనంపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. అమరావతి అభివృద్ధి విషయంలో ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందుంచాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. నిర్మాణాల వ్యయం, టెండర్లు, కాంట్రాక్టులు, పనుల పురోగతి తదితర వివరాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు. ప్రజల సొమ్ముతో చేపడుతున్న ప్రతి పనికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. అమరావతి నిర్మాణం పేరుతో భారీగా అప్పులు చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడే అవకాశం ఉందని అంబటి ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని అభివృద్ధి అవసరమే అయినప్పటికీ ప్రజాధనాన్ని సమర్థంగా, పారదర్శకంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

## విద్యుత్ కాంతుల్లో అమరావతి

- ముువ్వన్నెల శోభతో మురిసిన రాజధాని.
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబు.
- అసెంబ్లీ, సచివాలయం, ప్రకాశం బ్యారేజీ సహా ప్రముఖ కట్టడాలకు ప్రత్యేక అలంకరణ



**అమరావతి, మహా** : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాజధాని అమరావతి, విజయవాడ ప్రాంతాలు విద్యుత్ కాంతులతో కొత్త శోభను సంతరించుకున్నాయి. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని రాజధాని ప్రాంతంలోని ప్రధాన ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలు, ప్రముఖ ప్రదేశాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగుల్లో అసెంబ్లీ, సచివాలయ భవనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.అమరావతిలోని రాష్ట్ర సచివాలయ ప్రాంగణానికి ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. సచివాలయంలోని ఐదు భవనాలకు మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో ప్రాంగణం త్రివర్ణ కాంతులతో మెరిసిపోతోంది. భవనాల చుట్టూ, ప్రధాన ప్రవేశ మార్గాల్లో ఏర్పాటు చేసిన అలంకరణలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ భవనాన్నీ విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భవనం నిర్మాణ శైలిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన లైటింగ్ రాత్రివేళ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అసెంబ్లీ, సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో మొత్తం ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. అమరావతిలోని సెంట్రల్ పార్కును సైతం వివిధ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పార్కు పరిసరాల్లో ఏర్పాటు చేసిన లైటింగ్ రాత్రివేళ ప్రత్యేక ఆకర్షణగా మారింది. రాజధాని ప్రాంతానికి వచ్చే ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా ఈ అలంకరణలు ఏర్పాటు చేశారు. విజయవాడలోని లోక్‌భవన్‌కు కూడా ప్రత్యేక విద్యుత్ అలంకరణ చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాంపు కార్యాలయాన్ని సైతం విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ప్రభుత్వ భవనాలు మొత్తం త్రివర్ణ కాంతులతో మెరిసిపోవడంతో రాజధాని ప్రాంతంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. విజయవాడకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచే ప్రకాశం బ్యారేజీని కూడా విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కృష్ణానదిపై వెలుగులు విరజిమ్ముతున్న బ్యారేజీ రాత్రి వేళ చూపరులను ఆకట్టుకుంటోంది. అలాగే చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఉండవల్లి గుహలకు కూడా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రాజధాని, విజయవాడ ప్రాంతాల్లోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలు, ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ప్రాంతాలకు కూడా పండుగ అలంకరణలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ విద్యుత్ అలంకరణలతో అమరావతి నుంచి విజయవాడ వరకు రాత్రివేళ ప్రత్యేకమైన వెలుగుల వాతావరణం కనిపిస్తోంది. జాతీయ పతాకంలోని మువ్వన్నెలను ప్రతిబింబించే విద్యుత్ కాంతులు, సుందరమైన లైటింగ్‌తో అమరావతి రాజధాని ప్రాంతం స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమైంది. ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలు ఒకేసారి వెలుగులతో మెరవడంతో రాజధాని ప్రాంతం పంద్రాగస్టు వేడుకలకు ఘనంగా ముస్తాబైన దృశ్యం కనువిందు చేస్తోంది.

## టీడీఆర్ నిబంధనల్లో కీలక మార్పులు

- హెచ్ఎండీఏ పరిధిలో ఎక్కడైనా వినియోగానికి అవకాశం.
- ఇకపై టీడీఆర్ జారీ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే




**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) జారీ, వినియోగానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. టీడీఆర్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరం చేసేలా తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012లో సవరణలు చేస్తూ ప్రభుత్వం జీవోఎంఎస్ నంబర్ 218 జారీ చేసింది. కొత్త నిబంధనలతో హెచ్ఎండీఏ పరిధిలో ప్రజా ప్రయోజన ప్రాజెక్టుల కోసం భూములు సమకూర్చే యజమానులకు టీడీఆర్ వినియోగంలో మరింత వెసులుబాటు కలగనుంది. హెచ్ఎండీఏ చేపట్టే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం అవసరమైన లేదా స్వాధీనం చేసుకున్న భూములకు ఇకపై హెచ్ఎండీఏనే టీడీఆర్ సర్టిఫికెట్లను జారీ చేయనుంది. రహదారుల విస్తరణ, ప్రజా ప్రయోజన ప్రాజెక్టులు, ఇతర మౌలిక వసతుల కోసం భూములను సమకూర్చిన సందర్భాల్లో ఈ విధానం వర్తించనుంది. క్యూర్,ప్యూర్ పరిధులతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా ప్రయోజనాలు లేదా ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చే సందర్భాల్లోనూ ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. తద్వారా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టులకు భూముల సమీకరణ ప్రక్రియలో టీడీఆర్ కీలక సాధనంగా మారనుంది. హెచ్ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్‌ను సంస్థ పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ వినియోగించుకునే లేదా డిస్పోజ్ చేసుకునే అవకాశం కల్పించారు. అంటే టీడీఆర్ పొందిన భూయజమాని తనకు లభించిన అభివృద్ధి హక్కులను నిబంధనలకు అనుగుణంగా హెచ్ఎండీఏ పరిధిలోని ఇతర అర్హత కలిగిన ప్రదేశాల్లో వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. టీడీఆర్ జారీ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడం కొత్త నిబంధనల్లో మరో ముఖ్యమైన మార్పు. టీడీఆర్ దరఖాస్తు, పరిశీలన, జారీ తదితర ప్రక్రియలను డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. దీనివల్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడంతోపాటు, ప్రక్రియలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంది. టీడీఆర్‌కు సంబంధించిన వివరాలు, లెక్కలు, జారీ, బదిలీ, వినియోగంలోనూ ఏకరీతి విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్, పట్టణ స్థానిక సంస్థ, ఎఫ్‌సీడీఏలకు టీడీఆర్ సర్టిఫికెట్ కాపీని అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తద్వారా టీడీఆర్ వినియోగంపై సంబంధిత సంస్థల వద్ద కూడా సమగ్ర రికార్డు అందుబాటులో ఉంటుంది. ఇదే సమయంలో 'బిల్డ్ నౌ' వ్యవస్థలోనూ టీడీఆర్‌కు సంబంధించిన మార్పులు చేశారు. టీడీఆర్ ప్రాసెసింగ్, సర్టిఫికెట్ల జారీ, అకౌంటింగ్, వినియోగాన్ని డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక మార్పులను ఈ వ్యవస్థలో చేపట్టనున్నారు. భవిష్యత్తులో టీడీఆర్ లావాదేవీలను ఒకే డిజిటల్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించేందుకు ఇది దోహదపడనుంది. ప్రజా ప్రయోజనాల కోసం భూములు సమకూర్చే యజమానులకు పరిహారానికి ప్రత్యామ్నాయంగా లేదా పరిహారంతో పాటు లభించే అభివృద్ధి హక్కులను సులభంగా వినియోగించుకునే విధంగా టీడీఆర్ విధానం పనిచేస్తుంది. సాధారణంగా రహదారుల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అవసరాల కోసం భూమిని వదులుకున్న యజమానికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి హక్కులు కల్పించడం ఈ విధానంలో ప్రధాన ఉద్దేశం. కొత్త నిబంధనలు గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో రహదారులు, ప్రజా మౌలిక వసతులు, భవిష్యత్ పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూముల సమీకరణతో పాటు టీడీఆర్ జారీ, వినియోగ ప్రక్రియ మరింత వ్యవస్థీకృతంగా మారే అవకాశం ఉంది.

ANN తెలుగు

మహా పత్రిక

శనివారం, హైదరాబాద్

15-08-2026









# వరుపుల రాజా.. ఆత్మీయనేతకు జననివాళి

**కాకినాడ, మహా ప్రతినిధి :**

జననేత సేవలను ఘనంగా స్మరించుకున్నారు. ఆ మహానేత సేవను తలుచుకుని.. వేలాదిమంది కదిలొచ్చి వారి గుండెల్లో ప్రతిష్ఠించుకున్న రూపాన్ని, అభిమానాన్ని చాటారు. పత్తిపాడు నియోజకవర్గ చరిత్రలో వరుపులరాజా.. ఓ అద్భుత జ్ఞాపకం. చెరిగిపోని సంతకమని జనం ఘనంగా చాటారు. ప్రత్తిపాడు రాజకీయ, సామాజిక ప్రస్థానంలో తనదైన ముద్ర వేసుకున్న దివంగత నేత స్వర్గీయ వరుపుల రాజా 51వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రాజా పై ఉన్న అభిమానం, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నియోజకవర్గం నలుమూలల నుంచి అభిమానులు, కార్యకర్తలు, స్నేహితులు, రాజకీయ సహచరులు భారీగా తరలివచ్చారు. ఈ ఒక్క కార్యక్రమానికి సుమారు 8 వేల నుంచి 10 వేల మంది హాజరు కావడంతో ప్రత్తిపాడు జనసంద్రమైంది. రాజా భౌతికంగా లేకపోయినా.. ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం, కార్యకర్తలతో ఆయన పెంచుకున్న ఆత్మీయత ఏమాత్రం తగ్గలేదని 51వ జయంతి వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.











**ప్రత్తిపాడులో అంబరాన్నంటిన 51వ జయంతి వేడుకలు**

**వేలాదిమంది హాజరు .. విగ్రహావిష్కరణ.. సేవా కార్యక్రమాలతో ఘన నివాళి**

**రాజా ఆశయాలే నా మార్గం".. ఎమ్మెల్యే సత్యప్రభ**

**రక్తదానం,.. జాబ్ మేళా.. మహా అన్నదానం కార్యక్రమాలు**

**జ్ఞాపకానికి శాశ్వత రూపం.. రాజా విగ్రహావిష్కరణ***

జయంతి వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా స్వర్గీయ వరుపుల రాజా విగ్రహావిష్కరణ నిలిచింది. ప్రత్తి పాడులో నాయకులు అభిమానులు , కార్యకర్తలు ఏర్పాటు చేసిన వరుపుల రాజా విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి జ్యోతుల నవీన్ , మంత్రి పొంగూరు నారాయణ, రా జ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభి మానులు, కార్యకర్తలు హాజరై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అభిమానుల నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది. ఒక నాయకుడి జ్ఞాపకాన్ని శాశ్వతంగా నిలిపేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఈ జయంతి వేడుకల్లో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. వరుపుల రాజా జయంతి కార్యక్రమా నికి పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, యనమల దివ్య, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు. రాజాతో తమకున్న అనుబంధా న్ని గుర్తు చేసుకున్న నాయకులు.. ప్రత్తిపాడు నియో జకవర్గ ప్రజల మనస్సుల్లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ కు రాజా అత్యంత సన్నిహితంగా ఉండేవారని గుర్తు చే సుకున్నారు. రాజా భౌతికంగా లేకపోయినా.. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు కల్పించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

**"రాజా ఆశయాలే నా మార్గం".. ఎమ్మెల్యే సత్యప్రభ***జయంతి సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ.. తన భర్త, దివంగత నేత వరుపుల రాజా నమ్ముకున్న సిద్ధాంతాలు, ప్రజాసేవా విధానాలను కొనసాగించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాజా గారు ఏ ఆశయాలతో ప్రజల కోసం పనిచేశారో.. అదే స్ఫూర్తితో తాను కూడా ముందుకు సాగుతున్నానని తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అందుబాటులో ఉండటం.. రాజా ని నమ్ముకున్న అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలవడం.. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయడమే తనకు ముఖ్యమని సత్యప్రభ స్పష్టం చేశారు. రాజా రాజకీయ ప్రయాణంలో ఆయనకు అండగా నిలిచిన స్నేహితులు, సన్నిహితులు, కార్యకర్తలు, అభిమానులు.. నేటికీ తనకు అదే ఆత్మీయతతో సహకరిస్తున్నారని ఆమె తెలిపారు. రాజా భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన ఆశయాలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం కొనసాగాలని.. అదే ఆయనకు తాను ఇచ్చే నిజమైన నివాళి అని సత్యప్రభ పేర్కొన్నారు. రాజా తో చిన్ననాటి నుంచి కలిసి నడిచిన స్నేహితులు, సన్నిహితులు, ఆయనను నమ్ముకున్న కార్యకర్తలు, అభిమానులు ఇప్పటికీ అదే కుటుంబ భావనతో సత్యప్రభకు అండగా నిలుస్తున్నారని కార్యక్రమంలో స్పష్టమైంది. రాజా భౌతికంగా దూరమైన తర్వాత కూడా ఆయనతో ఏర్పడిన వ్యక్తిగత, రాజకీయ అనుబంధాలు కొనసాగుతుండటం.. ఆయన నిర్మించుకున్న మానవ సంబంధాల బలాన్ని తెలియజేస్తోంది. రాజా తో కలిసి నడిచిన వారు.. ఇప్పుడు సత్యప్రభ వెంట నడుస్తుండటం ఆయన రాజకీయ వారసత్వానికి కనిపిస్తున్న కొనసాగింపుగా నిలిచింది.

**యువతకు ఉపాధి.. 35 కంపెనీలతో మెగా జాబ్ మేళా***రాజా 51వ జయంతిని పురస్కరించుకుని ప్రత్తిపాడులోని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాసం వద్ద వికాస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, టీడీపీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా జాబ్ మేళా, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 35 కార్పొరేట్ కంపెనీలు పాల్గొన్న జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బీటెక్ వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జయంతి వేడుకలను కేవలం నివాళులకే పరిమితం చేయకుండా.. యువత భవిష్యత్తుకు ఉపయోగపడే కార్యక్రమంగా నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది.

**అభిమానంలో కనిపించిన రాజా..**

ఈ జయంతి వేడుకల్లో కనిపించిన జనసందోహం కేవలం సంఖ్య కాదు. రాజా తో వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నవారు, ఆయన రాజకీయ ప్రయాణంలో కలిసి నడిచినవారు, ఆయనను నమ్ముకున్న కార్యకర్తలు, ఆయన సేవలను గుర్తు చేసుకునే అభిమానులు ఒకే వేదికపైకి వచ్చారు. నాయకుల్లో గౌరవం.. కార్యకర్తల్లో ఆత్మీయత.. స్నేహితుల్లో జ్ఞాపకం.. అభిమానుల్లో అభిమానం.. యువతలో ఆశయం. ఈ విభిన్న భావనలు ఒకే చోట కలిసిన వేడుకగా రాజా 51వ జయంతి నిలిచింది. ఓ జయంతి.. ఎన్నో జ్ఞాపకాలు. విగ్రహావిష్కరణతో రాజా గారి జ్ఞాప కానికి శాశ్వత రూపం లభించింది. జాబ్ మేళాతో యువతకు అవకాశాల వేదిక ఏర్పడింది. రక్తదానంతో సేవా స్ఫూర్తిని చాటారు.

రాజా కి ఇష్టమైన వంటకాలతో మహా అన్నదానం ద్వారా ఆత్మీయతను పంచుకున్నారు. పదివేలమంది కి పైగా తరలివచ్చిన జనసందోహం.. రాజా పై ఉన్న ప్రజాభిమానానికి ప్రత్యేక నిదర్శనంగా నిలిచింది.



## అభిమానుల రక్తదానం

మెగా రక్తదాన శిబిరానికి కూడా విశేష స్పందన లభించింది. రాజా అభిమానులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ అభిమానాన్ని కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా.. రక్తదానం వంటి సేవా కార్యక్రమం ద్వారా చాటుకోవడం జయంతి వే డుకల్లో మరో ముఖ్యమైన అంశంగా నిలిచింది. జయంతి వేడుకల్లో అత్యంత ఆత్మీయంగా నిలిచిన మరో కార్యక్రమం మహా అన్నదానం. వరుపుల రాజా కి ఎంతో ఇష్టమైన వంటకాలను ప్రత్యేకం గా వండించి.. ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో కా ర్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజలకు అందించారు. తమ నాయకుడికి ఇష్టమైన వంట కాలను ఆయన జయంతి రోజున వండి వడ్డించ డం ద్వారా అభిమానులు రాజా తో తమకున్న వ్యక్తి గత అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. రాజా లేని చోట.. ఆయనకు ఇష్టమైన వంటకాలు వడ్డించడం.. ఆయన జ్ఞాపకాలను అందరితో పం చుకోవడం.. అన్నదానాన్ని ఒక ఆత్మీయ నివాళిగా మార్చింది.

## జయంతి వేడుకకు మించిన సందేశం

వరుపుల రాజా 51వ జయంతి వేడుకలు ఒక కార్యక్రమంగా ప్రారంభమై.. చివరకు ఆయన వ్యక్తిత్వాన్ని, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని ప్రతి బింబించే వేదికగా మారాయి. రాజా భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయనతో కలిసి నడిచిన స్నేహితులు, కార్యకర్తలు, అభిమాను లు ఆయన జ్ఞాపకాలను కొనసాగిస్తున్నారు. అదే ఆయన రాజకీయ జీవితానికి మిగిలిన పెద్ద వారసత్వంగా కనిపిస్తోంది. విగ్రహంలో రాజా రూపం కనిపించింది. అభిమానుల్లో రాజా జ్ఞాపకం కనిపించింది.. కార్యకర్తల్లో రాజా బంధం కనిపించింది.. స్నేహితుల్లో ఆత్మీ యత కనిపించింది. సేవా కార్యక్రమాల్లో రాజా ఆశయం కనిపించింది. సత్యప్రభ మాటల్లో రాజా సిద్ధాంతాల కొనసాగింపు కనిపించింది. అందుకే ప్రత్తిపాడులో జరిగిన వరుపుల రాజా 51వ జయంతి వేడుకలు కేవలం ఒక జయంతి కార్యక్రమంగా కాకుండా.. ఒక నాయకుడి పట్ల ప్రజలు, కార్యకర్తలు, స్నేహితులు, రాజకీయ సహచరులు కలసి వ్యక్తం చేసిన జననివాళిగా నిలిచాయి. ప్రజల గుండెల్లో రాజా.. ప్రత్తిపాడు రాజకీయ చరిత్రలో చెరగని సంతకంగా ఆయన నిలిచారు.







# కుషాయిగూడ బస్‌స్టాప్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ .మహా :** కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యలు, రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు, చలాన్ల పేరుతో స్థానిక వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బస్‌స్టాప్ వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బస్సులు నిలిచే ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు, బారికేడ్ల కారణంగా ప్రయాణికులు, స్థానికులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ చలాన్ల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులను కూడా ఎమ్మెల్యేకు వివరించి, ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుషాయిగూడ ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బస్‌స్టాప్ సక్రమంగా కొనసాగడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతామని తెలిపారు. స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, పనగట్ల చక్రపాణి గౌడ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంప కృష్ణ గుప్తా, సారా అనిల్, స్థానిక నాయకులు, . వ్యాపారులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదగిరిగుట్ట ఆగస్టు 14 మహా:** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పరీక్షలు, ప్రసూతి సేవలు, భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి విధులకు సంబంధించిన సిబ్బంది అందరూ హాజరయ్యారా లేదా, ఎవరైనా గైర్హాజరయ్యారా అని కలెక్టర్ ఆరా తీశారు.జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో కూడా నమోదైన వివరాలు పరిశీలించారు.సిబ్బంది మీ ప్రమాణం యాప్‌లో రోజువారీ హాజరు నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. విధులకు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి రోజు పీహెచ్‌సీలో రోజువారీగా ఎంతమంది రోగులు ఓపీకి వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు., ఓపీకి వచ్చిన ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు.రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఫార్మసిస్టును అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మందుల నిల్వలు, పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో అందుబాటులో లేని పరీక్షలకు సంబంధించిన నమూనాలను ఏ ల్యాబ్‌కు పంపిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు.ప్రతి నెల ఆసుపత్రి లో ఎన్ని డెలివరీ జరిగినవి అని , గత నెల,ఈ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగియని, వాటిలో హైరిస్క్ గర్భిణులు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పీహెచ్‌సీలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, మిగిలిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మనోహర్, డాక్టర్లు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు




# వలిగొండ ఎస్సైగా శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ ఆగస్టు 14 మహా న్యూస్ :** వలిగొండ నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గురువారం బాధ్యత స్వీకరించారు శ్రీకాంత్ రెడ్డి ఎస్ఐ నల్లగొండ వాడపల్లి ఎస్సైగా పనిచేస్తూ సాధారణ బదిలిలో భాగంగా వలిగొండ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని ఆయన అన్నారు శుక్రవారం మహా న్యూస్ ప్రతినిది తో మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తానని తెలిపారు



# ఎర్ర పోచమ్మ – రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**కుషాయిగూడ, మహా :** నాగార్జుననగర్ కాలనీ రోడ్ నెం 6 లోని శ్రీ ఎర్ర పోచమ్మ .రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, ఆలయ అభివృద్ధి. భక్తులకు అవసరమైన సౌకర్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, బిఆర్ఎస్ నాయకులు గంప కృష్ణ గుప్తా, నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# కొత్త విద్యుత్ ఫీడర్ ఛానల్ ప్రారంభం

**మాట నిలబెట్టుకున్న విద్యుత్ అధికారులు**

**ఆలేరు ఆగస్టు 14 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికై 28 లక్షల రూపాయలతో కొత్త ఫీడర్ ఛానల్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. లో వోల్టేజ్ తో ఆ గ్రామస్తులు, రైతులు అనేక ఇబ్బందులు పడ్డ కారణంగా పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ ముందు గతంలో రైతులు గ్రామస్తులు ధర్నాకు దిగడంతో అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఒక రోజు ముందుగానే నూతన కొత్త ఫీడర్ను ఏర్పాటు చేశారు... ఈ సందర్భంగా రైతుల గ్రామ విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, విద్యుత్ అధికారులకటంగుటూరు గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడి పీర్ల నాయక్, ఏ ఈ విజయ్ సృజన్ కుమార్, లైన్మెన్ తానుషా గౌడ్, కాంట్రాక్టర్ ఇసాక్, టంగుటూరు గ్రామ పెద్దలు జాలపు అజిరెడ్డి, దూడల రోశయ్య, నిమ్మల సుధాకర్ రెడ్డి,కుంభం సోమిరెడ్డి భూపెల్లి కేశవులు, వెంకటేశ్వర్లు, బిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులను గ్రామ సర్పంచ్ జూకంటి అనిల్ శాలువాలతో సత్కరించారు కాగా గ్రామస్తులు సర్పంచ్ ను ఘనంగా సన్మానించారు.

# చేయూత పెన్షన్ పథకానికి నూతన దరఖాస్తుల స్వీకరణ

- అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్




**ఆలేరు ఆగస్టు 14 మహా**: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకంలో భాగంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన లబ్ధిదారుల నుంచి నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత అందించే ఉద్దేశంతో పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు పెన్షన్ పొందని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల ఆగస్టు 31వ తేదీలోగా ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు. అర్హత కలిగిన వారు ఆలస్యం చేయకుండా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వితంతు పెన్షన్‌కు నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, భర్త మరణ ధృవపత్రంతో పాటు భర్త ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫోటో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దివ్యాంగుల పెన్షన్‌కు నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫోటో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఒంటరి మహిళల పెన్షన్‌కు నూతన అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సంబంధిత ధృవపత్రం, కుల ధృవపత్రం జిరాక్స్, ఆధార్ ధృవపత్రం జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫోటో తదితర అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ తెలిపారు. అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువు లోపు దరఖాస్తులు సమర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# టైర్లతో ఆయిల్ తయారీ కంపెనీ ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14 యాదాద్రి మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రంగపూర్ గ్రామ సమీపంలో టైర్లతో ఆయిల్ తయారు చేసే కంపెనీని ప్రభుత్వ విప్, ఆలేరు బీర్ల అయిలయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా కంపెనీలో భారీగా నిల్వ ఉన్న టైర్లను, అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితిని పరిశీలించారు కనీస భద్రతా జాగ్రత్తలు లేకుండా కార్మికులు పనిచేస్తుండటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు కంపెనీ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా? లేదా? అనే పూర్తి సమాచారాన్ని రెండు, మూడు రోజుల్లో అందించాలని అధికారులను ఆదేచారు అక్కడి నుండే జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ తో ఫోన్లో మాట్లాడారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఐలయ్య మాట్లాడుతూ కంపెనీ వల్ల ప్రజలకు ఇబ్బందులు, కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయా అనే అంశంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశం. నిబంధనలు, అనుమతులు ఉల్లంఘించినట్లు తేలితే ఎలాంటి ఆలస్యం లేకుండా కంపెనీపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ముప్పు కలిగించే పరిశ్రమల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.



# ఆలేరులో తిరంగు ర్యాలీ

- **100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన**

**ఆలేరు ఆగస్టు 14 మహా**: 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులచే పెద్ద ఎత్తున తిరంగు ర్యాలీ నిర్వహించారు... ర్యాలీలో విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు ఆలేరు హై స్కూల్ నుండి దుర్గమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిరంగు ర్యాలీ జిల్లా కన్వీనర్ తడిసిన మల్లారెడ్డి, ఆలేరు ఇంచార్జ్ పూజారి కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, కంతున శంకర్, వడ్లమన్ నరేందర్, కౌన్సిలర్లు పాశాకంటి సంపత్, బొట్ల సంపత్, పేరపు ఆనంద్, శేషత్వం అర్చన, తోట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు కార్యక్రమంలో జెఎంజె, ఏకశిలా, రామకృష్ణ,అయ్యప్ప కాలేజ్, ఎస్ ఆర్ కాలేజ్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



# హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో తిరంగా కార్యక్రమం

- **పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14 మహా**: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రంగాపూర్ గ్రామ సమీపంలోని హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం నిర్వహించిన తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన గౌరవ వందనాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వీకరించారు. అనంతరం విద్యార్థులు సైనిక శిక్షణలో భాగంగా నిర్వహించే వివిధ విన్యాసాలు, కవాతు, క్రమశిక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆర్మీలో జవాన్లు శిక్షణ పొందే విధానాన్ని తలపించేలా విద్యార్థులు ఉత్సాహంగా, క్రమశిక్షణతో నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనే లక్ష్యంతో విద్యార్థులు పొందుతున్న శిక్షణను ఎమ్మెల్యే ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొంది భవిష్యత్తులో సైన్యంలో చేరి దేశ సేవ చేయాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దిపల్లి, రేగులగండిలో
# దోమల మందు పిచికారీ

- **సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు..**
- **విప్పలగుంపులో వైద్య శిబిరం**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామాలైన పెద్దిపల్లి, రేగులగండి గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మొదటి విడతగా దోమల మందు పిచికారీ చేపట్టారు. మలేరియా, డెంగీ తదితర జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. అనంతరం పగిడేరు గ్రామపంచాయతీ పరిధిలోని విప్పలగుంపులో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వీరాస్వామి, పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెచ్‌వీ అనసూర్య, హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, సుజాత, కౌసల్య, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిరతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## వలిగొండలో వాహనాలు తనిఖీ చేసిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ ఆగస్టు 14 మహా న్యూస్** వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి వాహనాలు తనికి చేపట్టారు వాహనాలు తనిఖీలు భాగంగా నెంబర్ ప్లేట్ లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు అలాగే ఇన్సూరెన్స్ హెల్మెట్ బండి కాగితాలు లేకుండా నడిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు



## మంత్రి పొంగులేటి పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయం



- పొంగులేటి శ్రీనన్నను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు: రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్

**సత్తుపల్లి, ఆగస్టు 14: మహా :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి రాజకీయ విమర్శల పేరుతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై దురుసుగా మాట్లాడటం సరికాదని మట్టా దయానంద్ అన్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి వలస వెళ్లిన కౌశిక్‌రెడ్డికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే నైతిక స్థాయి లేదని వ్యాఖ్యానించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వతహాగా కాంట్రాక్టు పనులు చేసుకుంటూ ప్రజలతో మమేకమై ఎదిగిన నాయకుడని, ప్రజల నుంచి వచ్చిన నాయకుడిగా, ప్రజా ఆదరణతో రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సత్తుపల్లి నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లను మంజూరు చేసిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిదేనని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో కౌశిక్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం పదవులు ఇస్తామని నమ్మించి పలువురిని మోసం చేసిందని, పదవులన్నీ ఒకే కుటుంబానికి పరిమితం చేసుకోవడం వల్లే ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. మీరు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి పదవుల కోసం ఆశీస్సులు తీసుకున్న పరిస్థితులు గతంలో ఉన్నాయని మట్టా దయానంద్ వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎవరి కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఆయనకు అండగా నిలుస్తారని దయానంద్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి ప్రజాదరణ కలిగిన నాయకులను బీఆర్ఎస్ దూరం చేసుకోవడం వల్లే ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైందని మట్టా దయానంద్ తోసిపుచ్చారు. ప్రజల ఆదరణతోనే కాంగ్రెస్ నాయకులు గెలిచి చూపించారని, రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రెపరెపలాడిన 200 మీటర్ల మువ్వన్నెల పతాకం

- దేశభక్తిని చాటిన యువత
- మణుగూరులో ఆకట్టుకున్న భారీ జాతీయ పతాక ప్రదర్శన

**మణుగూరు, మహా :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో దేశభక్తి వెల్లివిరిసింది. భారతీయ సేవా సమితి సభ్యుడు దుగ్గి బ్రహ్మతేజ ఆధ్వర్యంలో శుక్రవారం 200 మీటర్ల భారీ మువ్వన్నెల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు, దేశభక్తులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ పతాకాన్ని చేతబట్టి దేశభక్తిని చాటారు. పట్టణంలోని అశోక్‌నగర్ నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా సురక్ష బస్టాండ్ వరకు 200 మీటర్ల జాతీయ పతాకంతో ప్రదర్శన కొనసాగింది. యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పట్టణ ప్రధాన వీధులు మువ్వన్నెల శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా దుగ్గి బ్రహ్మతేజ మాట్లాడుతూ యువతలో దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించడమే ఈ భారీ జాతీయ పతాక ప్రదర్శన ప్రధాన ఉద్దేశమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ దేశం పట్ల ప్రేమ, కుటుంబం పట్ల బాధ్యత పెంచుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా ఎదగాలని ఆకాంక్షించారు. దేశ రక్షణ, సమాజ సేవలో యువత ముందుండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. 200 మీటర్ల మువ్వన్నెల పతాక ప్రదర్శనకు సహకరించి, ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, పుర ప్రముఖులు, దేశభక్తులు, వివిధ సంఘాల నాయకులకు ఈ సందర్భంగా దుగ్గి బ్రహ్మతేజ కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యార్థులకు బ్యాగులు, షూస్ పంపిణీ

**ఎంఈఓ జుంకీలాల్ వెల్లడి**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, షూస్ ను మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ శుక్రవారం విద్యా వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, కస్తూరిబా గాంధీ, బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలుర విద్యార్థులు అందరికి బ్యాగులు, షూస్ వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటన్నిటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశామన్నారు. ఉన్నత అధికారుల ఆదేశానుసారం ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేయాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ సంజీవరావు, జూలూరుపాడు కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు పెండ్యాల వెంకటేశ్వరరావు, పెంటయ్య, సీఆర్పీలు రమణ, పద్మ, నాగేశ్వరరావు, ఐఆర్పిలు సాంబశివరావు, శ్రీను, నిరోషా, శ్రావణి పాల్గొన్నారు.

## భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత, ఐపీఎస్
- జనగామ భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీపీ



**జనగామ మహా ;** జనగామ జిల్లా లోని భరోసా కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, భరోసా కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రానికి వచ్చే బాధితులను సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు ఒకే వేదిక పై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును న్యాయపరంగా చట్టపరంగా త్వరగా పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్శనలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ సుధా, లీగల్ అడ్వైజర్ దయామణి, సపోర్ట్ పర్సన్స్ స్వాతి, అపర్ణతో పాటు ఇతర సిబ్బంది సునీత, హరిత పాల్గొన్నారు.



## వరి నాట్లు వేయొద్దు.. ఆరుతడి పంటలే మేలు..

- వర్షా భావ స్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- మండల వ్యవసాయ అధికారి వి రాహుల్‌రెడ్డి

**మణుగూరు, మహా :** మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రస్తుతం వరి నాట్లు వేయకుండా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి వి రాహుల్‌రెడ్డి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సూచనల మేరకు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా పెసర, కంది, మినుము వంటి పప్పుధాన్యాలతో పాటు కూరగాయ పంటలను సాగు చేయడం మేలని తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లో పంట నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు తమ వద్ద అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని రాహుల్‌రెడ్డి కోరారు. పంటల ఎంపికలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.



## ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

**ఆదిలాబాద్ మహా** : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలంటే రైతులు సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడ గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏపీఓ మంద మకరంద్‌తో కలిసి గ్రామంలో స్వయంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటి రైతులను ప్రోత్సహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఒకసారి ఆయిల్ పామ్ తోటను ఏర్పాటు చేస్తే సుమారు 25 నుంచి 30 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పంట ద్వారా రైతులు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, ఇతర ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని రైతులకు సూచించారు. ఐటీడీఏ ఏపీఓ మంద మకరంద్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన మొక్కలు, సాంకేతిక పరిజ్ఞానం అందించడంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన అధికారి సందీప్ కుమార్, స్థానిక సర్పంచ్, వ్యవసాయ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ నిరసన

- పట్టణంలో పాదయాత్ర-సత్యాగ్రహం

**ఆదిలాబాద్ మహా**: హల్ద్వానీ ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డీసీసీ ఆధ్వర్యంలో పాదయాత్ర, సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం నుండి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని సత్యాగ్రహం చేపట్టారు.హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరైన సమావేశ ప్రాంగణాన్ని కొన్ని హిందూ అతివాద సంస్థలు గంగాజలంతో శుద్ధీకరణ చేయడాన్ని ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు నరేష్‌జాదవ్ అన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం వంటి రాజ్యాంగ విలువలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. వివక్షాపూరిత చర్యలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యతిరేకిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ పాదయాత్ర, సత్యాగ్రహ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.దేశంలో అన్ని వర్గాల ప్రజలు సమాన హక్కులతో, పరస్పర గౌరవంతో జీవించేలా సామాజిక ఐక్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెపూల నరసయ్య , బోరంచు శ్రీకాంత్ రెడ్డి , అల్లూరి సంజీవరెడ్డి , సాజిద్ ఖాన్,మల్లెపూల సత్యనారాయణ , కొమరం సత్యవతి కోటేష్, అడ్డి భోజా రెడ్డి గోక గణేష్‌రెడ్డి , ఖిజార్ పాషా ,పరమేశ్వర్ , అంబకంటి అశోక్ , మోతి రాము ,మునిగేలా నర్సింగ్ , మంగేష్‌దేవతడే , సుధాకర్ గౌడ్ ,హిమాభి షేక్ రెడ్డి , పసుల చంటి ,మల్యాల కరుణాకర్ , బండి దేవదాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



## వేమనపల్లి మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ

**బెల్లం పల్లి,మహా**: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమనపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఏటా రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలుచేస్తూ నిర్వహించిన ర్యాలీ మండలకేంద్రంలో దేశభక్తి స్ఫూర్తిని నింపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎస్టీ మోర్చా మంచిర్యాల జిల్లాధ్యక్షులు అడే ప్రేమ్‌సింగ్ పాల్గొని మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత దేశభక్తి, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఎస్సీ మోర్చా నాయకులు కొట్టూరు పోశయ్య, మహిళా మోర్చా నాయకురాలు లావణ్య, మండల ప్రధాన కార్యదర్శి ఏనుముల వెంకటేష్, ఎస్టీ మోర్చా నాయకులు కుర్మ లస్మయ్య, బీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా షూస్ అందజేత

- పంపిణీ చేసిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాది రమేష్ బాబు



**బెల్లంపల్లి, మహా**: బెల్లంపల్లి పట్టణంలో 7వ వార్డ్ సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన "యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్" పథకం ద్వారా విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న షూష్‌ను విద్యార్థులకు బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్‌బాబు శుక్రవారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వార్డ్ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాముని చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగింపు

- చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని కాముని చెరువులో గుర్రపు డెక్క వ్యర్థాల తొలగింపు ప్రక్రియను( పారిశుద్ధ )పనులను మాజీ చైర్మన్ సుష్మా రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులో గుర్రపు డెక్క ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోకుండా నిరంతరం సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. చెరువులను శుభ్రపరచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు అనారోగ్య లను నుంచి కాపాడినట్టు అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రై ఫ్రూట్స్ షాపులో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు.

- పలు శాంపుల్స్ ల్యాబ్‌కు తరలింపు
- రిపోర్టు అనంతరం తదుపరి చర్యలు ఉంటాయి
- ఫుడ్ సేఫ్టీ అధికారి దేవనిధి



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని తొండుపల్లిలో అజ్వన్ డేట్స్, నట్స్ షాపులో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కిస్మిస్, లవంగాలు నాసిరకంగా ఉన్నాయి అని స్థానికుల ఫిర్యాదుతో శంషాబాద్ ఫుడ్ ఇన్స్పెక్టర్ దేవనిధి షాప్ లో తనిఖీలు నిర్వహించి డ్రై ఫుడ్ నిల్వలను పరిశీలించారు. షాపులో ఉన్న వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, నట్స్, ఆహార పదార్థాల నుంచి శాంపూల్స్ సేకరించారు. ప్యాకేంగ్ తేదీ, ఎక్స్పైరీ తేదీ, లైసెన్స్ వివరాలను సేకరించారు. దేవనిధి మాట్లాడుతూ సేకరించిన శాంపూల్స్ ను ల్యాబ్‌కు పంపించి పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు కొనుగోలు చేసే ముందు ఉత్పత్తి తేదీ నాణ్యతను పరిశీలించాలని సూచించారు.




# బేల మండలంలో పోలీస్ మీకోసం

- చప్రాల లో ఉచిత వైద్య శిబిరం

**ఆదిలాబాద్ మహా**: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా బేల మండలం చప్రాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు. గ్రామ ప్రజలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావాలనే బవాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు.అందరి సహకారంతో జిల్లాలో నేరాలు, ఆక్సిడెంట్ కేసులు తగ్గించామన్నారు.శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు ఎస్పీ అవగాహన కల్పించారు. గంజాయిపై యుద్ధం చేయాలని మార్పు వల్లే గంజాయిని సమాజం నుంచి దూరం చేయవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, గంజాయి రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 15 మంది వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, క్రీడలు క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ కిట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, ఎస్ఐలు మధుకృష్ణ, పి. గౌతమ్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 500 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి కాకతీయ మ్యూజికల్ గార్డెన్

- జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్




**హనుమకొండ, మహా ;** ఇటీవల రూ. 6.20 కోట్లతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను ఆగస్టు 15, శనివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు వాకర్లకు మ్యూజికల్ గార్డెన్ అందుబాటులో ఉంటుందని, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాధారణ సందర్శకులు గార్డెన్‌ను సందర్శించవచ్చని తెలిపారు. మ్యూజికల్ గార్డెన్ నిర్వహణ, సౌకర్యాల పరిరక్షణ కోసం సందర్శకుల నుంచి కనీస టికెట్ రుసుము వసూలు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.అదేవిధంగా ప్రతిరోజూ సాయంత్రం 7.30 గంటలకు మల్టీమీడియా షో, (మ్యూజికల్ షో) నిర్వహించనున్నట్లు తెలిపారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వినోదాన్ని అందించేలా గార్డెన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను సందర్శించాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు.



# ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు...

**రాజేంద్రనగర్ మహా;** భారతీయ మజ్దూర్ సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘం చలో ఇందర పార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ నుండి ఇందిర పార్క్ వరకు భారీర్యాలీ, ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్మికులందరూ భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో అండ్ టాక్సీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చింతల నంద కిషోర్, ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, దాసి రెడ్డి, సలీం, రాజు, గౌస్, శివ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

**జూలూరుపాడు, మహా:** స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపులో భాగంగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరుకుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరి రమేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్వతంత్ర దినోత్సవ వేడుకల వేల దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించబడుతున్నాయన్నారు. ప్రజలందరూ దేశ సమైక్యతను, దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు. దేశ స్వతంత్రం కోసం ఎంతోమంది నాయకులు ఉద్యమాలు, పోరాటాలు చేసి బ్రిటిష్ వారిని పారదోలారని గుర్తు చేశారు. వారిని ఆదర్శంగా తీసుకొని పౌరులందరూ దేశం కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఈ యాత్రలో రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# కాజీపేట ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి

- పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు
- కాంట్రాక్టర్ల ను హెచ్చరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ, మహా ;** హనుమకొండ జిల్లా కాజీపేటలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.శుక్రవారం కాజీపేటలో కొనసాగుతున్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు.పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల జాప్యంలో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించేది లేదని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఆర్‌ఓబీ నిర్మాణ పనుల పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు. తదితరులు పాల్గొన్నారు.

# మోడీకి కాలం మూడింది : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ఆలేరు , మహా:** 12 సంవత్సరాల పరిపాలనలో అన్ని వర్గాలను అణిచివేస్తూ అంటరాని తనాన్ని పెంచి పోషిస్తు, మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తున్న ప్రధాని మోడీకి కాలం మూడిందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య నాయకత్వంలో భారతదేశ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖార్గేను బిజెపి నాయకులు అవమానించడాన్ని నిరసిస్తూ ఖార్గేకు మద్దతుగా శుక్రవారం ఆలేరు పట్టణంలో ర్యాలీ,సత్యాగ్రహం నిర్వహించారు.. అంటరానితనానికి వ్యతిరేకంగా గాంధీ పోరాడని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారికి రాజ్యాంగం హక్కులు కల్పించారని బిజెపి నాయకులు అంటరాని తనని పెంచి పోషించడాని తీవ్రంగా ఖండించారు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖార్గే గడిచిన ప్రదేశాన్ని బిజెపి నాయకులు గంగా జల్లాలతో శుద్ధి చేయడాన్ని ఎమ్మెల్యే తీవ్రంగా విమర్శించారు, శుద్ధి చేయాల్సింది ఆ ప్రదేశాన్ని కాదని మీ మనసులను దేహాలను శుద్ధి చేసుకోవాలని హితబోధ చేశారు కార్గేకు బిజెపి నాయకులు మోడీ వెంటనే క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య డిమాండ్ చేశారు.. జిల్లాలోని 17 మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలేరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీకి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి నివాళులర్పించి అక్కడే సత్యాగ్రహ దీక్షలు చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిఎసిఎస్ ఆలేరు చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి, తంగళ్ళపల్లి రవికుమార్, పోతనక్ ప్రమోద్ కుమార్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమని భాస్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాలు నీలం పద్మ వెంకటస్వామి, ఆలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గంగమల్ల అశోక్, పట్టణ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, జిల్లా నాయకుడు ఏజాజ్ పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

# శుద్ధీకరణ ఒక బూటకం బీజేపీ ఆడే ఓ నాటకం

- ఖర్గే కు సంఘీభావంగా కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- హల్ద్వానీ ఘటనకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణుల అర్ధ నగ్న సత్యాగ్రహ ర్యాలీ
- నిర్వహించిన డిసిసి అధ్యక్షుడు అయూబ్ పాల్గొన్న ఎమ్మెల్సీ , ఎమ్మెల్యే




**వరంగల్, బ్యూరో మహా :** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన అవమానకర చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో వెంకట్రామ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ సత్యాగ్రహ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అర్ధ నగ్న ప్రదర్శనతో కాశీబుగ్గ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరై కాంగ్రెస్ శ్రేణులకు సంఘీభావం తెలిపారు.అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి జై భీమ్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూహల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన అవమానకరమైన చర్య అత్యంత బాధాకరమన్నారు. కులం, మతం పేరుతో ఒక వ్యక్తిని అవమానించడం, వివక్షకు గురిచేయడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. గుడి, మసీదు ముందు పవిత్ర గంగాజలాన్ని తీసుకువచ్చి శుద్ధి చేస్తున్నట్లుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాదులు ఒక బూటకపు నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. కుల, మత వివక్షకు తావులేని సమాజం కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛా గౌరవం కల్పించిందని, ఈ విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు.దేశం అభివృద్ధి వైపు ముందుకు సాగుతున్న సమయంలో కుల వివక్షత, అంటరానితనం వంటి తిరోగమన ఆలోచనలను ప్రోత్సహించడం దురదృష్టకరమని భారతదేశంలో ప్రతి పౌరుడూ సమానమే. ఎవరి కులం, మతం, సామాజిక నేపథ్యం ఆధారంగా వారిని తక్కువ చేసి చూడటానికి ఎవరికీ హక్కు లేదని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే ఏ చర్యనైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు.మల్లికార్జున ఖర్గే కు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు అయూబ్ తెలిపారు. దేశంలో సామాజిక సామరస్యాన్ని, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో నిరంతరం పోరాడుతామని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా నిలుస్తోందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నగరంలో ఘనంగా తిరంగ్ బైక్ ర్యాలీ

- పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్,బ్యూరో మహా ;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఓసిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగ్ బైక్ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. జాతీయ జెండాలతో ద్విచక్ర వాహనాల పై పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఓసిటి కాలనీవాసులు, స్థానికులు దేశభక్తిని చాటుతూ భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ భావాలను పెంపొందించు కోవాలని పిలుపునిచ్చారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు "హర్ ఘర్ తిరంగా" స్ఫూర్తితో ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని యువతలో జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకం అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పేర్కొన్నారు.జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ ప్రజలందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఓసిటి రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షులు జోగు చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ముత్తూట్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పోటీలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేదర బస్తిలో ఉన్న శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రథమ బహుమతి: ఎస్.కె జునైద్, ద్వితీయ బహుమతి రేశ్వంత్, తృతీయ బహుమతి ఎం.హాసిని సాధించారు. విజేతలకు ఒక్కొక్కరికి రూ.500 నగదు బహుమతితో పాటు మెడల్ సర్టిఫికెట్స్ ను ముత్తూట్ సంస్థ ప్రతినిధులు రాకేష్ యాదవ్, సాయిరామ్ తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత విజేతలను అభినందించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు రాంబాబు, మహాలక్ష్మి, చరిత శ్రీ, ముత్తూట్ సంస్థ సిబ్బంది కార్తీక్, ప్రియాంకా రెడ్డి, కోమల, సంగీత తదితరులు పాల్గొన్నారు.



# కిలోమీటర్ మేర లారీల పార్కింగ్

**బసంత నగర్ ఆగస్టు 14 మహా** పెద్దపల్లి జిల్లా, రామగుండం నియోజకవర్గం, పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి వచ్చే లారీలను రోడ్డుపైనే కిలోమీటర్ పొడవున పార్కింగ్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బసంత్‌నగర్ నుంచి ఈశాలతక్కలపల్లి, పాలకుర్తి గ్రామాల వైపు వెళ్లే ప్రధాన రహదారిపై లారీలు వరుసగా నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రహదారిపై లారీల పార్కింగ్ మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు. బసంత్‌నగర్‌లో రోడ్డుపైనే కిలోమీటర్ మేర లారీల పార్కింగ్. అల్ట్రాటెక్ యాజమాన్యం లారీల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి, రహదారిపై లారీలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. సంబంధిత అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం సమస్యను పరిశీలించి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పట్నం అభివృద్ధిపై మల్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం!

- వర్షా కాలం దృష్ట్యా ప్రజాసమస్యలపై తొలిప్రాధాన్యం
- పారిశుద్ధ్యం నుంచి రోడ్ల వరకు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి...
- ప్రభుత్వ భూమి కబ్జాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
- అధికారులు ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే మల్ రెడ్డి సమీక్ష...

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 14 మహా:** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని... క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదిభట్ల సర్కిల్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు సత్యనారాయణ రెడ్డి, వై సుదర్శనలతో, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఆక్రమణలు, సంక్షేమ పథకాల అమలు తీరు, పనుల పురోగతిపై అధికారులతో ఆయన ఆరా తీశారు. పట్టణాభివృద్ధిపై ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణను ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్న ఆయన... వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, నాలాల పూడికతీతను వేగవంతం చేయాలని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లు, గుంతల మరమ్మతులను తక్షణమే పూర్తి చేసి, వీధి దీపాలు పనిచేయని ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిభట్ల సర్కిల్ డీసీ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, టీపీవోలు, టీపీఎస్ లు, పారిశుధ్య విభాగం ఇన్ స్పెక్టర్ వనజ, వార్డు ఆఫీసర్లు, ఏఈలు, డీఈలు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## దొంగతనం కేసును ఛేదించిన జూలూరుపాడు పోలీస్

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని వేంగన్నపాలెం గ్రామంలో చేతన్ జ్యూలరీలో గత నెలలో జరిగిన బంగారు ఆభరణాల దొంగతనం కేసును జూలూరుపాడు పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లాకు చెందిన నిందితుడు జ్యోతి బాబును గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడి వద్ద నుండి 6 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు జ్యోతి బాబును అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న ఆస్తితో సహా న్యాయస్థానం ముందు హాజరుపరచగా, న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు.



## మండల స్థాయి ప్రజావాణి సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్**

**మంచిర్యాల, మహా :** 17 ఆగస్టు నుండి జిల్లావ్యాప్తంగా అన్ని మండలలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భావన సమావేశ మందిరంలో ప్రజావాణి పర్యవేక్షకులు శ్రావణ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, హెచ్ హెచ్ ఆర్ పి సుమన్ లతో కలిసి జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజల నుంచి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ, ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ, వివరాల నమోదు తదితర సాంకేతిక అంశాలపై సాంకేతిక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం సమర్థంగా నిర్వహించాలి

**వరంగల్, కార్పొరేషన్ మహా :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం హాసన్‌పర్తిలోని కేంద్రాన్ని, పలివెల్పులలోని లార్డ్ వృద్ధాశ్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో ప్రస్తుతం రెండు షెడ్లు అందుబాటులో ఉన్నందున కాశీబుగ్గ, కాజీపేట సర్కిళ్లకు వేర్వేరుగా కేటాయించి శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. నిర్వహణను రెండు ఏజెన్సీలకు అప్పగించాలని, నిబంధనల ప్రకారం స్టెరిలైజేషన్ చేపట్టాలని ఆదేశించారు. జంతువులకు ప్రత్యేక కేజ్‌లు, రేబిస్ సోకిన కుక్కలకు ప్రత్యేక ఐసోలేషన్ వసతులు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. కేంద్రం ఆవరణలో పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనంతో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దాలని అన్నారు.

అనంతరం పలివెల్పుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కమిషనర్ వృద్ధులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని, నిర్వహణ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఇంజనీరింగ్, పశువైద్య శాఖల అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సీపీ శ్వేత ఆదేశాలు**



**హనుమకొండ, మహా ;** ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లా పరకాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి, అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సిటీ పోలీస్ కమిషనర్ శ్వేత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పరకాలలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సీపీ శ్వేత ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ బాషా తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్రూఫ్ టెంట్లు, సభా వేదిక, ప్రజలు, వీఐపీలకు సంబంధించిన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, పారిశుద్ధ్యం, టాయిలెట్స్ మంచినీటి సరఫరా తదితర ఏర్పాట్లను కలెక్టర్, సీపీ పరిశీలించారు. పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, వారికి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, డీసీపీ అంకిత్, జిల్లా అధికారులు, రెవెన్యూ, ఇంజినీరింగ్, మున్సిపల్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- **పనులు వేగవంతం చేయాలి**
- **నాణ్యతలో రాజీ పడొద్దు**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని పనులు సైతం వేగవంతం చేయడంతో పాటుగా నాణ్యతలో రాజీ పడవద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.37.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు ఇల్లందు చెరువులో నీటి నిల్వలు సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య వసతి భోజనం మౌలిక వసతులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఇల్లందు పట్టణంలో రూ.37.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తూ ఇన్‌పేషెంట్ ఔట్ పేషెంట్ విభాగాలు ఐసీయూ ఎమర్జెన్సీ విభాగం వార్డులు వెయిటింగ్ హాల్ మరుగుదొడ్లు తదితర సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.

ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలను సౌకర్యవంతంగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఇల్లందు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా ఎమర్జెన్సీ, ఐసీయూ తదితర విభాగాలను అవసరమైన సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకొని పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించరాదని ఉపయోగించే నిర్మాణ సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**చెరువు పరిశీలన...**

ఇదే క్రమంలో ఇల్లందు చెరువును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెరువులోని ప్రస్తుత నీటిమట్టం నీటి నిల్వ పూర్తి స్థాయి నీటిమట్టం గరిష్ఠ నీటిమట్టం రోజువారీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న నీటి పరిమాణం నీటి డిశ్చార్జ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం 219.150 మీటర్లు, గరిష్ఠ నీటిమట్టం 219.750 మీటర్లు కాగా పూర్తి నిల్వ సామర్థ్యం 45 ఎంసీఎఫ్‌టీ, నీటి విస్తీర్ణం 136.23 ఎకరాలు, క్యాచ్‌మెంట్ ఏరియా 26 చదరపు కిలోమీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ చేపట్టాలని నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నీటి వినియోగం సాగునీటి పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులతో కూడా కలెక్టర్ సమీక్షించారు. ఇల్లందు పరిధిలోని వ్యవసాయ భూములకు చెరువుల ద్వారా అందుతున్న సాగునీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రొంపేడు, చల్లసముద్రం తదితర ప్రాంతాల్లో చెరువుల నీటితో సాగు చేస్తున్న పంటలు సాగు విస్తీర్ణం సాగునీటి లభ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. విద్యా సంస్థల పనితీరుపై దృష్టి సారించిన కలెక్టర్ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు విద్యాబోధన పాఠ్యపుస్తకాలు యూనిఫార్ములు వసతి భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం సాధించిన ఫలితాలను కొనసాగిస్తూ ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలలోని లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగిస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో పఠన అలవాట్లు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందేలా అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించేలా చూడాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనల్లో కలెక్టర్ వెంట తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే పై వివక్ష చూపడం సిగ్గుచేటు

- **హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**
- **జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ సత్యాగ్రహ నిరసన ర్యాలీ**
- **పాల్గొన్న వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యేలు**




**హనుమకొండ, మహా :** ఇటీవల హల్ద్వానీ లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన వివక్ష పూరిత, అవమానకర చర్యను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఏఐసీసీ ఆదేశాల మేరకు శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యక్షునికి సంఘీభావం తెలియజేస్తూ, ఈ హేయమైన చర్యకు నిరసనగా నగరంలోని అంబేద్కర్ జంక్షన్ నుండి పబ్లిక్ గార్డెన్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు "సత్యాగ్రహం" కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యాగ్రహ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు అత్యంత విచారకరమైన రోజు అని దేశ ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటైన ఒక ఘటన పై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున తీవ్ర నిరసన వ్యక్తం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న, కోట్ల మంది ప్రజల గొంతుకగా నిలిచిన రాజ్యసభ ప్రతిపక్ష నేత, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన కుల వివక్ష చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒక దళిత బిడ్డ దేశంలో అతిపెద్ద పార్టీకి అధ్యక్షుడిగా ఉండి, బహిరంగ సభలో మాట్లాడితే.. ఆ వేదిక అపవిత్రమైందంటూ గంగాజలంతో 'శుద్ధీకరణ' తో పాటు 'హవనం' చేయడం దేనికి సంకేతం? భారత రాజ్యాంగం ప్రకారం అస్పృశ్యత, కుల వివక్ష నేరం. కానీ, బీజేపీ మరియు దాని అనుబంధ సంస్థలు నడుపుతున్న నయామనువాద పాలనలో దళితులకు, వెనుకబడిన వర్గాలకు గౌరవం లేకుండా పోతోంది. 21వ శతాబ్దంలో విజ్ఞాన సాంకేతికతతో దూసుకుపోతున్న తరుణంలో, ఇంకా ఇలాంటి మైండ్‌సెట్‌ను ప్రోత్సహించడం సిగ్గుచేటు. ఈ ఘటనపై బాధ్యులైన వారిని తక్షణమే 'అస్పృశ్యత నిరోధక చట్టం' కింద అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాము. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న దళిత నేత, కాంగ్రెస్ పార్టీ నవ సారథి మల్లికార్జున ఖర్గేపై జరిగిన వివక్షా పూరిత దాడి ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. ఇలాంటి చర్యలు బాధ్యతారాహిత్యానికి, అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. ఖర్గే గారికి దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ వివక్షకు కారణమైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ గ్రేన్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ తౌటం జాన్సి,, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ మరియు జనరల్ సెక్రటరీ గొట్టిముక్కల సాగరిక రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాసరావు, ప్రముఖ నాయకులు బత్తిని శ్రీనివాస్ రావు లు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్ల మరియు మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- **3 నెలల గర్భిణీతో ఉన్న భార్యను సురక్షితంగా అప్పగించాలి**
- **కుటుంబ సభ్యులపై దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలి.**
- **అధికారులను అభ్యర్థిస్తున్న బాధితుడు మడే రాజు తోపాటు తల్లి.**




**బెల్లంపల్లి, మహా:** భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన మడే రాజు, (కోయ) 23, అదే గ్రామానికి చెందిన ఎల్లాల సుహితలు గత కొంతకాలంగా ప్రేమించి ఇటీవల వివాహం చేసుకోగా అమ్మాయి బంధువులు తమపై దాడి చేసి మూడు నెలల గర్భిణీ అయిన తన భార్యను అపహరించడం జరిగిందని దాడి చేసిన నిందితులపై అట్రాసిటీ కేసునమోదు చేసి తనకు న్యాయంచేయాలని బాధితుడు మడే రాజుతో పాటు ఆయన తల్లి పేర్కొన్నారు. శుక్రవారం నాడు (టేకుల బస్తి) బెల్లంపల్లి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం మేజర్లమైన తాము ప్రేమించి పెళ్లి చేసుకుని (కులాంతర వివాహం) జీవనం సాగిస్తుండగా తమ దంపతులను విడదీసేందుకు , అమ్మాయి తండ్రి ఎల్లాల చంద్రకుమార్ తమను గ్రామ సర్పంచ్ పోతరాజుల సతీష్ ద్వారా పిలిపించి, తమపై దాడి చేసి అమ్మాయిని కొట్టి బలవంతంగా తీసుకెళ్లిన, సంఘటనకు బాధ్యులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితుడు అధికారులను అభ్యర్థించారు. మడే రాజు తోపాటు ఆయన తల్లి సంధ్యారాణి మాట్లాడుతూ భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన మడే రాజు, (కోయ) 23, అదే గ్రామానికి చెందిన ఎల్లాల సుహిత, మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుని గత నెల రోజుల క్రితం పెళ్లి సైతం చేసుకున్నామని హైదరాబాదులో జీవనం కొనసాగిస్తుండగా గ్రామ సర్పంచ్ పోతరాజుల సతీష్ ద్వారా తన భార్య సుహిత తల్లికి ఆరోగ్యం బాగోలేదని పిలిపించగా శుక్రవారం గ్రామానికి వచ్చి ఆయన మాటపై నమ్మకం లేక బెల్లంపల్లి ఏసిపిని ఆశ్రయించి జరిగిన విషయం అంతా తెలిపి రక్షణ కల్పించాల్సిందిగా వేడుకోవడం జరిగిందన్నారు, ఈ పరిస్థితిలో ఊర్లోకి వెళ్ళితే బాగుండదని తెలపడంతో తిరిగి ప్రయాణమై వెళుతుంటే అమ్మాయి తండ్రి ఎల్లాల చంద్రకుమార్ ఆయన బంధువులు అంబిలం పుష్పలత, గడం తిరుపతి, మరో వ్యక్తి, మందమర్రి ఫ్లై ఓవర్ దిగువన జాతీయ రహదారిపై మమ్మల్ని అడ్డగించి విచక్షణారహితంగా తనతోపాటు భార్య సుహిత, అమ్మ సంధ్యారాణి లపై దాడి చేసి సెల్ ఫోన్లు ధ్వంసం చేసి తన భార్యను బలవంతంగా తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన భార్య ప్రస్తుతం మూడు నెలల గర్భిణీతో ఉందని ఆమెకి ఏమైనా జరిగితే దానికి పూర్తి బాధ్యత తన భార్య తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. చట్టపరంగా మేజర్లమైన మేము పెళ్లి చేసుకుంటే తమపై దాడి చేసి తీసుకెళ్లిన చంద్రకుమార్, అతని బంధువులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకొని తన భార్యను అప్పగించాలని డిమాండ్ చేశాడు. తనతోపాటు కుటుంబ సభ్యులకు ఎల్లాల చంద్రకుమార్ తో ప్రాణభయం ఉందని తమకు రక్షణ కల్పించి చట్టపరంగా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్థానిక ఏసిపి కిరణ్ కుమార్ తో వివరణ అడగగా సంబంధిత వ్యక్తులు వచ్చిన మాట వాస్తవమేనని వారి తల్లి తండ్రులను పిలిపిస్తామని ప్రయత్నిస్తుండగా వద్దులేండి అని వారే బయటికి వెళ్లిపోయినట్లు వివరించారు.



# మండల స్థాయి ప్రజావాణి సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్**


**మంచిర్యాల, మహా :** 17 ఆగస్టు నుండి జిల్లావ్యాప్తంగా అన్ని మండలలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భావన సమావేశ మందిరంలో ప్రజావాణి పర్యవేక్షకులు శ్రావణ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, హెచ్ హెచ్ ఆర్ పి సుమన్ లతో కలిసి జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజల నుంచి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ, ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ, వివరాల నమోదు తదితర సాంకేతిక అంశాలపై సాంకేతిక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# అత్యుత్తమ పోలీసు సేవకు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ మెడల్

**కరీంనగర్ అదనపు డీసీపీ పి. వెంకట రమణకు రాష్ట్రపతి పోలీస్ మెడల్**




**కరీంనగర్, మహా :** పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు, అంకితభావం, సమర్థవంతమైన విధి నిర్వహణకు గుర్తింపుగా కరీంనగర్ కమిషనరేట్ అదనపు డీసీపీ పి. వెంకట రమణకు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ పతకాలలో భాగంగా ఆయన ఈ గౌరవాన్ని అందుకోనున్నారు.

**మూడు దశాబ్దాల పోలీస్ సేవ**

1991లో సబ్ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో ప్రస్థానం ప్రారంభించిన వెంకట రమణ హైదరాబాద్‌లోని పలు కీలక, మతపరంగా సున్నితమైన ప్రాంతాలతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. 2005లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. చత్రినాక, ముషీరాబాద్, అంబర్‌పేట్, జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

2017లో ఏసీపీగా పదోన్నతి పొందిన ఆయన హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం, గోపాలాపురం, నార్త్ జోన్, తెలంగాణ విజిలెన్స్, ఎస్ఆర్ నగర్ వెస్ట్ జోన్ తదితర ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

**కీలక కేసుల ఛేదనలో కీలక పాత్ర**

సబ్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో మాదకద్రవ్యాల కేసులు, అక్రమ ఆయుధాల స్వాధీనం, ఉత్తర భారత ముఠాలు, నకిలీ స్టాంపులు, నకిలీ ఇందిరా వికాస్ పత్రాలు, గంజాయి, నకిలీ సర్టిఫికెట్లకు సంబంధించిన కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించారు. జడ్చర్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పనిచేసిన సమయంలో హత్యలు, హైవే దోపిడీలు, సామూహిక అత్యాచార కేసులను ఛేదించి నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టారు.

**విశిష్ట సేవలకు పలు పురస్కారాలు**

వెంకట రమణ ఇప్పటికే తెలంగాణ పోలీస్ సేవా పతకం-2010, తెలంగాణ పోలీస్ ఉత్తమ సేవా పతకం-2018, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తమ దర్యాప్తు పతకం-2022 వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. ఆయన సేవా రికార్డులో 107 నగదు పురస్కారాలు, ఒక అదనపు వేతన పెంపు, 7 ప్రశంసా పత్రాలు, 4 అభినందనలు, 15 ప్రత్యేక ప్రశంసలు, 162 సాధారణ ప్రశంసలు ఉన్నాయి. 2025 మే 22న అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, అదే ఏడాది జూన్ 2 నుంచి కరీంనగర్ కమిషనరేట్ అదనపు డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణ, అంకితభావం, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజా భద్రత పట్ల నిబద్ధతతో విశిష్ట సేవలు అందించిన వెంకట రమణకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ లభించడంపై కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# జ్యోతి పూర్వాజ్ కొత్త లుక్..

విడుదల తేదీని ఫొటోలోనే చూపించారు.. ఇంతకీ ఆ తేదీ ఏంటో గుర్తుపట్టగలరా? తాజాగా నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్) సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అవుట్‌డోర్ లొకేషన్‌లో తీసిన ఈ ఫొటోల్లో జ్యోతి ఎంతో స్టైలిష్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపించారు. బ్రౌన్ రంగు షీర్ ఫుల్ స్లీవ్స్ టాప్‌తో పాటు ఫిటెడ్ డిస్ట్రెస్డ్ బ్లూ జీన్స్ ధరించారు. పెద్ద సన్‌గ్లాసెస్, విరబోసిన నల్లటి జుట్టు, చైన్ స్ట్రాప్ బ్యాగ్‌తో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. రాతి గోడ, పచ్చని చెట్ల మధ్య ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.జ్యోతి పూర్వాజ్ కర్ణాటకలోని మడికేరిలో జన్మించారు. చిన్న వయసులోనే నటనపై ఆసక్తి పెంచుకున్న ఆమె కన్నడ టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టారు. 'జోగుల', 'కిన్నరి', 'మూరు గంతు' వంటి పలు కన్నడ సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులకు పరిచయమయ్యారు. విభిన్నమైన పాత్రలు పోషిస్తూ క్రమంగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు.తెలుగు టెలివిజన్‌లోకి వచ్చిన తర్వాత జ్యోతి కెరీర్ మరో స్థాయికి చేరింది. ప్రముఖ సీరియల్ 'గుప్పెడంత మనసు'లో జగతి పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఆమె పోషించిన జగతి పాత్రకు మంచి స్పందన లభించింది. ఆ పాత్ర ద్వారా జ్యోతికి తెలుగులోనూ భారీగా అభిమానులు ఏర్పడ్డారు. తమిళంలోనూ 'కాట్రుక్కెన్న వేలి' సీరియల్‌లో నటించి అక్కడి ప్రేక్షకులను అలరించారు. బుల్లితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న తర్వాత జ్యోతి వెండితెర వైపు అడుగులు వేశారు. 2017లో విడుదలైన తుళు చిత్రం 'మడిపు'తో సినిమాల్లోకి అరంగేట్రం చేశారు. అనంతరం కన్నడ చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలను అందుకున్నారు. 'డియా', '99', 'జెర్సీ నంబర్ 10', 'సప్లయర్ శంకర', 'నైస్ రోడ్' వంటి చిత్రాల్లో నటించారు. టెలివిజన్‌తో పోలిస్తే సినిమాల్లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనా పరిధిని విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం జ్యోతి పూర్వాజ్ కెరీర్‌లో ఆసక్తికరమైన దశ కొనసాగుతోంది. ముఖ్యంగా బహుభాషా సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను ఆమె భర్త సుకు పూర్వాజ్ తెరకెక్కిస్తున్నారు. 'కిల్‌ఆర్', 'కిల్లర్: డ్రీమ్ గర్ల్' పేర్లతోనూ ఈ ప్రాజెక్ట్ గురించి ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో జ్యోతి పలు భిన్నమైన కోణాలున్న పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. ఇక 'ఎ మాస్టర్‌పీస్'తో పాటు 'హల్కా డాన్' వంటి ప్రాజెక్టుల్లోనూ జ్యోతి భాగమయ్యారు. టెలివిజన్ సీరియల్స్‌తో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న ఆమె.. ఇప్పుడు సినిమాల ద్వారా మరింత విస్తృతమైన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారు. నటనతో పాటు తన స్టైలిష్ ఫొటోషూట్లతోనూ సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు సందడి చేస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ ఫొటోల్లో జ్యోతి గ్లామరస్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు ప్రత్యేకంగా స్పందిస్తున్నారు. సినిమాలు, సీరియల్స్‌తో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే ఆమెకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఈ ఫొటోలోనే తన తదుపరి ప్రాజెక్ట్ విడుదల తేదీకి సంబంధించిన క్లూను ఇచ్చారా? అనే చర్చ కూడా జరుగుతోంది.



# సంక్రాంతి ఖరారు.. మరి భోగి సంగతేంటి శర్వా?



హీరో శర్వానంద్ నటిస్తున్న 'భోగి' చిత్రంపై ఇప్పుడు ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాను ఆగస్టు 28న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్రబృందం గతంలో అధికారికంగా ప్రకటించింది. అయితే విడుదలకు ఇంకా రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో.. నిజంగానే ఆ తేదీకి సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనే సందేహాలు మొదలయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలనుకుంటున్న ఈ చిత్రానికి ఈ సమయానికి ప్రమోషన్స్ జోరుగా సాగాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు మేకర్స్ నుంచి ఆశించిన స్థాయిలో ప్రచార కార్యక్రమాలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.దర్శకుడు సంపత్ నంది ఇటీవల సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సోషల్ మీడియాలో వెల్లడించారు. అయితే ఆ సందర్భంగా సినిమా విడుదల తేదీపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో ముందుగా ప్రకటించిన ఆగస్టు 28 తేదీపై అనుమానాలు మరింత పెరిగాయి. ఇప్పటికే చిత్రబృందం భారీ స్థాయిలో క్లైమాక్స్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. సుమారు 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో 22 రోజుల పాటు ఈ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించినట్లు సమాచారం. షూటింగ్ పనులు వేగంగా సాగుతున్నప్పటికీ.. విడుదల తేదీ దగ్గరపడుతున్న సమయంలో ప్రమోషనల్ కార్యక్రమాలు ఊపందుకోకపోవడం అభిమానులను అయోమయానికి గురిచేస్తోంది. సాధారణంగా పాన్ ఇండియా సినిమాల విషయంలో విడుదలకు కొన్ని వారాల ముందే ప్రచారాన్ని భారీగా ప్రారంభిస్తారు. టీజర్, ట్రైలర్, పాటలు, వరుస ప్రమోషనల్ ఈవెంట్లతో సినిమాపై అంచనాలను పెంచుతారు. కానీ 'భోగి' విషయంలో మాత్రం అలాంటి హడావుడి ఇప్పటివరకు కనిపించకపోవడంతో విడుదల తేదీ మారే అవకాశం ఉందా? అనే చర్చ మొదలైంది. 1960ల కాలం నాటి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో శర్వానంద్ ఇప్పటివరకు చేయని రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో కనిపించనున్నాడు. 'గంగా' అనే పాత్రలో ఆయన కనిపించనున్నట్లు సమాచారం. కథకు అనుగుణంగా శర్వానంద్ తన లుక్, బాడీ లాంగ్వేజ్‌లోనూ ప్రత్యేకమైన మార్పులు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. 'భోగి'ని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో సినిమాకు దేశవ్యాప్తంగా మంచి బజ్ తీసుకురావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విడుదల తేదీకి తక్కువ సమయం మాత్రమే ఉండటంతో ప్రచార కార్యక్రమాలపై ప్రేక్షకుల దృష్టి నెలకొంది. ఇప్పటికైనా మేకర్స్ ప్రమోషన్స్ వేగవంతం చేస్తారా? లేక విడుదల తేదీని మార్చి కొత్త డేట్‌ను ప్రకటిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా.. శర్వానంద్ తన తదుపరి సినిమాను ఇప్పటికే లైన్‌లో పెట్టేశాడు. ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కనున్న 'జార్జ్ క్రిష్' చిత్రాన్ని ఇటీవలే ప్రారంభించారు. ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ముందుగానే ప్రకటించింది. దీంతో ఈ సినిమా విషయంలో మాత్రం రిలీజ్ ప్లానింగ్ స్పష్టంగా కనిపిస్తోంది. సంక్రాంతి సీజన్‌ను టార్గెట్ చేస్తూ ముందుగానే తేదీని ఖరారు చేసుకోవడం విశేషం. శర్వానంద్ లైనప్‌లోని ఈ రెండు సినిమాలు పూర్తి భిన్నమైన కథలు, జానర్లతో రూపొందుతున్నాయి. 'భోగి'లో రా లుక్, యాక్షన్, పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌తో కనిపించనున్న శర్వా.. 'జార్జ్ క్రిష్'లో మాత్రం పూర్తిస్థాయి వినోదాత్మక పాత్రలో ప్రేక్షకులను నవ్వించనున్నట్లు తెలుస్తోంది. ఒకే సమయంలో రెండు విభిన్నమైన జానర్ల సినిమాలను ఎంచుకోవడం ఆయన కెరీర్‌కు ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం 'జార్జ్ క్రిష్'కు సంక్రాంతి రిలీజ్ డేట్ స్పష్టంగా ఉన్నప్పటికీ.. 'భోగి' విషయంలోనే అసలు సస్పెన్స్ కొనసాగుతోంది. ఆగస్టు 28న విడుదల చేస్తామని ఇప్పటికే ప్రకటించినందున అధికారికంగా తేదీ మారిందనే సమాచారం ఇప్పటివరకు లేదు. అయితే ప్రమోషన్ల విషయంలో కనిపిస్తున్న నిశ్శబ్దం మాత్రం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. చెప్పిన తేదీకే శర్వానంద్ 'భోగి'గా బాక్సాఫీస్ బరిలోకి దిగుతాడా? లేక కొత్త విడుదల తేదీతో ప్రేక్షకుల ముందుకు వస్తాడా? అన్నది మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. సంక్రాంతి బరిలో ముందుగానే స్థానం ఖరారు చేసుకున్న శర్వా.. ముందుగా 'భోగి'తో ఎలాంటి సందడి చేస్తాడో చూడాలి.




# బాలయ్య సినీ ప్రస్థానం.. తిరుగులేని రికార్డులు

తెలుగు చిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ సినీ ప్రయాణం ఎంతో ప్రత్యేకమైనది. ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఆయన కెరీర్‌లో ఎన్నో విజయాలు, అరుదైన రికార్డులు ఉన్నాయి. వసూళ్ల విషయంలోనే కాకుండా.. అత్యధిక రోజులు థియేటర్లలో ప్రదర్శితమైన చిత్రాల రికార్డు కూడా బాలకృష్ణ ఖాతాలో ఉంది. తన పని అయిపోయిందని విమర్శలు వచ్చిన ప్రతిసారీ ఘనమైన కంబ్యాక్‌తో సమాధానం చెప్పడం బాలయ్యకు అలవాటుగా మారింది.వెండితెర అరంగేట్రం : మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదో కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నుంచి నేర్చుకున్న క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం.. తల్లి బసవరామతారకం అందించిన ప్రేమ, ఆప్యాయతలు ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. చదువుకుంటూనే 1974లో తండ్రి ఎన్టీఆర్ నటించిన 'తాతమ్మకల' చిత్రంతో బాలయ్య బాలనటుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 'అన్నదమ్ముల అనుబంధం', 'వేములవాడ భీమకవి', 'దానవీరశూరకర్ణ', 'శ్రీమద్విరాటపర్వము', 'శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం', 'రౌడీరాముడుకొంటె కృష్ణుడు', 'అనురాగదేవత', 'సింహం నవ్వింది', 'శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' తదితర చిత్రాల్లో తండ్రి ఎన్టీఆర్‌తో కలిసి నటించారు. 1984లో 'సాహసమే జీవితం' చిత్రంతో సోలో హీరోగా మారారు. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. వరుసగా మూడు సినిమాలు నిరాశపరచడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి. కానీ నాలుగో చిత్రమైన 'మంగమ్మగారి మనవడు'తో తన సత్తా ఏంటో నిరూపించారు. ఈ సినిమా ఏకంగా 565 రోజులు ప్రదర్శితమై అప్పట్లో సంచలన రికార్డు సృష్టించింది.

# ప్రభాస్ డీపీ మార్పు.. నెట్టింట మళ్లీ ట్రెండింగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఏ చిన్న పని చేసినా సోషల్ మీడియాలో వైరల్ కావడం సాధారణమే. తాజాగా ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రొఫైల్ ఫొటోను మార్చడంతో అభిమానుల్లో ఒక్కసారిగా ఉత్సాహం నెలకొంది. ప్రభాస్ కొత్త డీపీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఇన్‌స్టాగ్రామ్‌లోకి వచ్చినప్పటి నుంచి ప్రభాస్ దాదాపు ఏడేళ్లుగా ఒకే ప్రొఫైల్ ఫొటోను కొనసాగిస్తూ వచ్చారు. తనకు దేశవ్యాప్తంగా స్టార్‌డమ్ తీసుకొచ్చిన 'బాహుబలి'లోని ఫొటోనే ఇన్నాళ్లూ డీపీగా ఉంచారు. సినిమాలకు సంబంధించిన పోస్టర్లు, లుక్స్, అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకున్నప్పటికీ.. తన ప్రొఫైల్ పిక్చర్‌ను మాత్రం మార్చకుండా అలాగే కొనసాగించారు.అయితే ఇప్పుడు చాలా కాలం తర్వాత ప్రభాస్ తన డీపీని మార్చారు. రాబోయే చిత్రం 'ఫౌజీ'లోని లుక్‌కు సంబంధించిన ఫొటోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టడంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. డీపీ మారిన విషయం బయటకు వచ్చిన వెంటనే ప్రభాస్ అభిమానులు ఆ ఫొటోను విపరీతంగా షేర్ చేయడం మొదలుపెట్టారు.కొద్ది నిమిషాల్లోనే ప్రభాస్ కొత్త డీపీ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అభిమానులు ఈ ఫొటోను తమ ఖాతాల్లో షేర్ చేస్తూ సందడి చేశారు. దీంతో ప్రభాస్ డీపీకి సంబంధించిన హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. ప్రభాస్ కేవలం ప్రొఫైల్ ఫొటో మార్చడంతోనే భారీ స్థాయిలో సోషల్ మీడియా బజ్ క్రియేట్ చేశారని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. కథా నేపథ్యానికి తగ్గట్టుగా ప్రభాస్ పాత్ర, లుక్ కూడా చాలా ప్రత్యేకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆయన ఇంతకుముందు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కథకు కీలకమైన సన్నివేశాలతో పాటు యాక్షన్ ఎపిసోడ్లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. పీరియాడిక్ కథ కావడంతో అప్పటి కాలాన్ని ప్రతిబింబించేలా భారీ సెట్స్, ప్రత్యేకమైన లొకేషన్లను ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com